

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 16-03-2023 సంపుటి : 04 సంచిక : 176 పేజీలు : 4 వెల : రూ 3-00

# తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఇంటర్ పరీక్షలు

**పరీక్షా కేంద్రాలకు గంట ముందు చేరిక**

**నిముషం ఆలస్యం నిబంధన ఖచ్చితంగా అమలు**

**గూగుల్‌ను నమ్మి పరీక్షను కోల్పోయిన ఖమ్మం విద్యార్థి**



హైదరాబాద్/విజయవాడ,మార్చి15(: తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు మొదలైన పరీక్ష మధ్యాహ్నం 12 గంటలకు ముగిసింది. ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం అవుతాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఇంటర్మీడియట్ పరీక్షలను ఏప్రిల్ 4 వరకు నిర్వహించనున్నారు. తెలంగాణలో మొత్తం 9,47,699 మంది పరీక్షలు రాస్తున్నారు. వీరిలో 4,82,677 మంది ఫస్టియర్, 4,65,022 మంది సెకెండీయర్ విద్యార్థులు ఉన్నారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 75 లయింగ్ స్క్వాడ్స్ పనిచేస్తున్నాయి. విద్యార్థులకు ఏ ఇబ్బంది తలెత్తినా 040 – 24601010, 040 – 24655027 నంబర్లకు ఫోన్ చేయవచ్చని బోర్డు అధికారులు సూచించారు. ఇకపోతే ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 10,03,990 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4,84,197 కాగా.. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,19,793 మంది ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,489 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి 20–25 పరీక్ష కేంద్రాలకు కలిపి ఒక అంబులెన్సును సిద్ధంగా ఉంచారు. ఇకపోతే తొలిరోజు కొన్ని అపశృతులు తప్పలేదు. నిముషంఆలస్యం విషయాన్ని విద్యార్థులు సీరియస్‌గా తీసుకోకపోవడంతో పలుచోట్ల పరీక్షకు దూరమయ్యారు. ఇంటర్ పరీక్షలంటే ముందుగానే పరీక్షా కేంద్రాన్ని చూసుకోవాలని, సమయం కంటే కాస్త ముందుగానే సెంటర్‌కు చేరుకోవాలని బోర్డు చేసిన హెచ్చరికలను బేఖాతర్ చేశారు. ఓ విద్యార్థి పరీక్షా కేంద్రానికి గూగుల్ మ్యాప్‌ను ఆధారంగా చేసుకొని బయలుదేరాడు. చివరికి ఆ గూగుల్ రాంగ్ లొకేషన్ చూపించింది.. ఇంకేముంది.. అసలు పరీక్షా కేంద్రం ఎక్కడుందా ? అంటూ వెతుక్కొని అక్కడికి చేరుకునేసరికి అరగంట ఆలస్యమైపోయింది.. చేసేదేమిలేక ఇక ఇంటిదారి పట్టాడు ఆ విద్యార్థి....! ఈ ఘటన ఖమ్మంలోని ఎన్ఎస్ పి ప్రభుత్వ పాఠశాలలో జరిగింది.తెలుగు రాష్ట్రాల్లో ఈరోజు నుండి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకే పరీక్షలు ప్రారంభమవుతాయని, ఒక్క నిముషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని నిబంధన కూడా ఉంది. ముందే ఎగ్జామ్ సెంటర్ చూసుకోవాలి.. గంట ముందుగానే సెంటర్‌కు చేరుకోవాలని విద్యార్థులకు అధికారులు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ముందుగానే ఎగ్జామ్ సెంటర్‌ను చూసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇకపోతే ప్రైవేట్ విద్యాసంస్థలకు ముకుతాడు పడనుంది. కొన్ని కార్పొరేట్ కాలేజీలు విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకర్షించేందుకు టీవీల్లో, పేపర్లలో ఎక్కడ చూసినా వాళ్ల యాడ్స్ కనిపిస్తుంటాయి. అన్ని గ్రూప్స్‌లో మా కాలేజీ టాప్, ర్యాంకులన్నీ మావే అంటూ ప్రచారం చేసుకుంటారు. అంతేకాకుండా ఒక కాలేజీలో టాప్ ర్యాంక్ సాధించిన విద్యార్థి ఫొటోని అన్ని కాలేజీ పోస్టర్లలో వాడుకుంటున్నారు. దీనివల్ల పిల్లలతో పాటు తల్లిదండ్రులు కూడా తప్పుదోవ పట్టే అవకాశం ఉందని, కార్పొరేట్ కాలేజీలో చదివించాలనే ఆకాంక్షతో సమాజంలో ఒక రేస్ జరుగుతుందని, అలాంటి యాడ్స్ ని ఆపించాలని చాలాకాలంగా సదరు కాలేజీలపై ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఏ కాలేజీ అయినా ఇకపై అప్రకటన ఇవ్వాలంటే ఇంటర్ బోర్డు పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. యాడ్ కంటెంట్ నియంత్రణ, ఇతర విద్యా సమస్యలపై బోర్డు ఏర్పాటు చేసిన ఎనిమిది మంది సభ్యుల కమిటీ ఈ మేకు మార్గదర్శకాలను రూపొందిస్తోంది. ఒక టాప్ ర్యాంకర్ ఫొటోను ఇతర కాలేజీ యాడ్స్ లో వాడినట్లయితే కంటెంట్ మోడరేషన్ కింద సంబంధిత కాలేజీపై చర్యలు తీసుకోనున్నట్లు ఇంటర్ బోర్డు సెక్రెటరీ, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. అంతేకాకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఎక్స్ ట్రా క్లాసులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. దీనివల్ల విద్యర్థుల్లో ఒత్తిడి పెరుగుతుంది. అందుకే ఈ సమస్యపై కూడా త్వరలో చర్యలు తీసుకోనున్నట్లు నవీన్ తెలిపారు. టీచర్లకు వచ్చే ఏడాది నుంచి బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయనున్నారు.

# ఎపి అసెంబ్లీలో గందరగోళం

**కోటంరెడ్డి, టిడిపి సభ్యుల సస్పెన్షన్**

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ టిడిపి ఎమ్మెల్యేలు**



అమరావతి,మార్చి15: ఏపీ అసెంబ్లీలో వైసీపీ రెబల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. కోటంరెడ్డితో పాటు 12 మంది టీడీపీ ఎమ్మెల్యేలు కూడా సస్పెండ్ అయ్యారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడును ఈ సెషన్ మొత్తం సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు. అలాగే మిగిలిన సభ్యులను ఒకరోజు పాటు సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. హౌస్‌ను మిస్ లీడ్ చేసినందుకు, సభా కార్యకలాపాలకు పదేపదే అడ్డుతగిలినందుకు సస్పెండ్ చేస్తున్నామని స్పీకర్ తెలిపారు. దీంతో స్పీకర్‌కు వ్యతిరేకంగా టీడీపీ సభ్యులు నినాదాలు చేశారు.అంతకుముందు కేవలం ఇద్దరు టీడీపీ సభ్యులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడును మాత్రమే స్పీకర్ సస్పెండ్ చేశారు. గవర్నర్ రిసీవింగ్ అంశంపై సభలో చర్చ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనకు అవకాశం కల్పించాలని పదే పదే అడిగారు. సుమారు 40 నిమిషాలకు పైగా సభలో అధికారపార్టీ మంత్రులు, సభ్యులు మాట్లాడుతున్న సమయంలో పయ్యావుల అడ్డుతగిలారు. ఈ క్రమంలో పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదన లేకుండా తమరెలా సస్పెండ్ చేస్తారని టీడీపీ సభ్యులు ప్రశ్నించారు. దీంతో అప్పటికప్పుడు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మరలా వీరిద్దరిని సస్పెండ్ చేయాలని స్పీకర్‌కు వినతి చేశారు. అప్పుడు స్పీకర్ మరోసారి ఇద్దరు టీడీపీ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. సస్పెండ్ అయిన వారు సభ నుంచి బయటకు వెళ్లాలని కోరినప్పటికీ టీడీపీ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. దీంతో టీడీపీ సభ్యులు మొత్తాన్ని సస్పెండ్ చేస్తేనే వెళతామని అంటున్నారని... వీరి మొత్తాన్ని సస్పెండ్ చేస్తే తప్ప సభను జరగనివ్వరని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. టీడీపీ సభ్యులను అందరిని సస్పెండ్ చేయాలని మరో మంత్రి దాడిశెట్టి రాజా స్పీకర్‌కు తెలిపారు. సభ్యులకు ఎంత సమయం ఇచ్చినా వితండవాదం చేస్తుడటంతో టీడీపీ సభ్యులు 12 మందిని సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. టీడీపీ సభ్యులు నిమ్మల రామానాయుడు, బెందాళం అశోక్, అచ్చెన్నాయుడు, ఆదిరెడ్డి భవని, చినరాజప్ప, గణబాబు, పయ్యావుల కేశవ్, గ్ద్దె రామ్మోహన్, రామరాజు, ఏలూరి సంబశివరావు, డోలా వీరాంజనేయస్వామి, రవికుమార్‌లు సస్పెండ్ అయ్యారు. వీరితో పాటు వైసీపీ రెబల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిపై కూడా సస్పెన్షన్ వేటు పడింది. ఉదయం సభ మొదలైనప్పటి నుంచి కోటంరెడ్డి నిరసన తెలియజేస్తూనే ఉన్నారు.

# అవన్నీ కలిపితేనే మా జగన్: సీఎం జగన్



అమరావతి: ఏపీ అసెంబ్లీ సమావేశాలు రెండో రోజు కొనసాగుతున్నాయి. కాగా, సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ..రాజకీయ వ్యవస్థలో గొప్ప మార్పులను తీసుకొచ్చామన్నారు. మేనిఫెస్టో అంటే పవిత్ర గ్రంథం అని నిరూపించామని స్పష్టం చేశారు. అలాగే..నాకు ఇండస్ట్రీ రంగం ఎంత ముఖ్యమో.. వ్యవసాయం అంతే ముఖ్యం. నాకు ప్రభుత్వ ఉద్యోగులు ఎంత ముఖ్యమో.. అవ్వతాతలు కూడా అంతే ముఖ్యం. ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ ప్రభుత్వానికి ముఖ్యమే. గత ప్రభుత్వానివి అన్నీ గాలి మాటలే. గత ప్రభుత్వం గాల్లో నడిస్తే.. నేను నేలపై నడుస్తున్నానని స్పష్టం చేశారు.'పాలనలో పారదర్శకత తీసుకువచ్చేలా నాలుగేళ్ల పాలన సాగింది. మేనిఫెస్టోలో చెప్పిన 98.5 శాతం హామీలు అమలు చేశాం. కులం, మతం, ప్రాంతం, పార్టీని చూడకుండా పథకాలు అమలు చేశాం. అందరికీ మంచి చేశాం. విలువలు, విశ్వసనీయతే పునాదులుగా పనిచేస్తున్నాం. ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామని మనస్ఫూర్తిగా చెప్పగలుగుతున్నాను. లంచాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారులకు మేలు జరుగుతోంది. నిన్నటి కంటే నేడు, నేటి కంటే రేపు బాగున్నప్పుడే అభివృద్ధి.డీబీటీ ద్వారా రూ.1,97,473 కోట్లు లబ్ధిదారులకు అందించాం. గడప గడపకు వెళ్లి మేం చేసిన మంచిని చెప్తున్నాం. రాష్ట్రంలో జిల్లాల పెంపుతో సేవలు మరింత చేరువయ్యాయి. సచివాలయాల్లో దాదాపు 600 సేవలు అందుతున్నాయి. ప్రతీ 50 ఇళ్లకు ఒక వాలంటీర్ సేవలందిస్తున్నారు. 15004 గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశాం. గ్రామ/వార్డు సచివాలయాల్లో లక్షా 34వేల మందికి ఉద్యోగాలు కల్పించాం. ప్రతీ ఇంటికి 2.60 లక్షల మంది వాలంటీర్లు మంచి చేస్తున్నారు.గ్రామస్థాయిలో తీసుకొచ్చిన గొప్ప మార్పు ఆర్బీకేలు. దేశంలోనే తొలిసారిగా 10,778 ఆర్బీకేలు ఏర్పాటు చేశాం. ఇంత మంది అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్లు రైతన్నలకు తోడుగా ఉన్నారు. విత్తనం నుంచి పంట కొనుగోలు దాకా రైతన్నకు తోడుగా ఆర్బీకేలున్నాయి. రైతన్నలను చేయి పట్టుకొని నడిపించే వ్యవస్థ గ్రామస్థాయిలోనే ఉంది. 10,185 మంది సర్వేయర్లు గ్రామస్థాయిలో సేవలందిస్తున్నారు. కబ్జాలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం పలికేలా అడుగులు వేస్తున్నాం. పౌర సేవల్లో ఇది గొప్ప విప్లవం. వ్యవసాయానికి పగటిపూటే ఉచిత కరెంట్ ఇస్తున్నామన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. 45 నెలల పాలనలో సీఎం జగన్ మార్క్ స్పష్టం కనిపిస్తోంది. గ్రామస్థాయిలో గొప్ప అభివృద్ధిని చూపించగలిగాం.ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా మూడోసారి అగ్రస్థానంలో నిలిచాం. రాష్ట్రంలోని 6 పోర్టులు కాకుండా మరో 4 పోర్టులకు పనులు జరుగుతున్నాయి. పారిశ్రామిక రంగంలో తిరుగులేని మార్పునకు శ్రీకారం చుట్టాం. గతంలో లేని విధంగా రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయి.

# వివేకా హత్య జగనాసుర రక్త చరిత్ర

**చంద్రబాబునాయుడు**

అమరావతి వివేక హత్యకు నాలుగేళ్లు అయిన సందర్భంగా జస్టిస్ ఫర్ వివేకా అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు ట్వీట్ చేసారు. వివేకా హత్య జగనాసుర రక్త చరిత్ర అని పులివెందుల పూల అంగాళ్ల నుంచి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ తెలుసు అంటూ ట్వీట్ లో పేర్కొన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రాష్ట్రంలో ఒక్క పనీ చేయలేక పోయారు...చివరకు సొంత బాబాయ్ హత్య కేసులో నిజమైన నిందితులను శిక్షించడంతో సహా....!వివేకా హత్య జగనాసుర రక్త చరిత్రే అని పులివెందుల పూల అంగళ్ల సెంటర్ నుంచి రాష్ట్రంలో ప్రతి ఇంటా తెలుసు...అది ఆ ఇంట జరిగిన కుట్రే. తండ్రి శవం పక్కన ఉండగానే పదవి కోసం సంతకాలు సేకరించిన వ్యక్తి... బాబాయ్ హత్య తో రాజకీయ లబ్ధి పొందిన వ్యక్తి....ఆడబిడ్డకు న్యాయం చేస్తాడా? అంటూ వివేకా హత్య పరిణామాల పై టీడీపీ అధినేత ట్వీట్ లో రాసారు.



# నేను బీజేపీతో పొత్తులో ఉంటే ముస్లింలు నాకు దూరం

**వారికి ఇష్టం లేకపోతే నేను బీజేపీ దూరం**

**జనసేన అధినేత పవన్ కల్యాణ్**

అమరావతి మార్చ్ 15 జనసేన–బీజేపీ పొత్తుపై చాలా రోజులుగా చిత్రవిచిత్రాలుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ రూమర్స్‌పై ఆవిర్భావ సభా వేదికగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. 'నేను బీజేపీతో పొత్తులో ఉంటే ముస్లింలు నాకు దూరం అవుతారని కొందరు అంటున్నారు. వారికి ఇష్టం లేకపోతే నేను బీజేపీ దూరంగా జరుగుతాను. పొత్తులో ఉంటే మాత్రం.. ఎక్కడైనా మైనార్టీలపై దాడి జరిగితే చూస్తూ ఊరుకోను. వెంటనే పొత్తు నుంచి బయటకువస్తానని మాట ఇస్తున్నా. మళ్లీ చెబుతున్నా ముస్లింలపై ఎవరు దాడులు చేసినా సరే ఊరుకునేది లేదు.. తాట తీస్తాను' అని పవన్ తేల్చిచెప్పారు. ముస్లీం సమాజానికి ఏపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని సేనాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతకు కీలక సూచన..!'నేను ఎక్కడికెళ్లినా జనం మార్పు కోరుకుంటున్నారు. ఏపీలో ఎస్సీ, ఎస్టీలు సంఖ్యాబలం ఉన్నా.. దేహి అనే పరిస్థితి ఉంది. ఇది వారి తప్పు కాదు అనైక్యతే సమస్య. నాకు అధికారం ఇస్తే మీ నేతలు పనిచేసేలా చేస్తాను. అగ్రవర్ణ పేదలు



అండగా ఉంటే కుల, మతాలకు అతీతంగా నేను అండగా ఉంటాను. మాకు ఏం చేస్తారని యువత కులనాయకులను నిలదీసే పరిస్థితి రావాలి. ఇంత అవినీతి జరుగుతుంటే యువతలో ఆవేశం ఎందుకు రాదు. యువతలో పరివర్తన రాకపోతే దేశం మారేది ఎప్పుడు..? ప్రభుత్వం కులాలను విడదీసే ప్రయత్నం చేస్తోంది. ఎప్పటికైనా సరే జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ప్రజలు అభిమానం కోసం అర్థాకలితో ఉంటాను' అని ఏపీ ప్రజానీకానికి, జనసేన కార్యకర్తలకు పవన్ భరోసా కల్పించారు.'జనసేన ఒంటరిగా వెళ్లేందుకు కూడా భయపడదు. డేటా తెప్పించుకోవాలి, విశ్లేషించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలి. బీజేపీతో పొత్తు పెట్టుకుని ఉంటే.. టీడీపీ కంటే ఎదిగిపోయే వాళ్లం. విశాఖ స్టీల్‌పై భావోద్వేగంగా మాట్లాడాను.

# అసెంబ్లీ సాక్షిగా వీడియోలతో సహా వాస్తవాలను బయటపెట్టిన మంత్రి బుగ్గన

అమరావతి: గవర్నర్ ప్రసంగంపై ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని అసెంబ్లీలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తిప్పికొట్టారు. గవర్నర్ ప్రసంగాన్ని కొందరు హేళనగా మాట్లాడుతున్నారని మంత్రి మండిపడ్డారు.గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం చర్చలో ఆయన మాట్లాడుతూ, గవర్నర్ ప్రసంగంపై ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తోందన్నారు. పయ్యావుల బండారాన్ని మంత్రి బుగ్గన బయటపెట్టారు. గవర్నర్‌కు సీఎం స్వాగతం పలకలేదనే టీడీపీ తప్పుడు ప్రచారంపై వీడియోలతో సహా వాస్తవాలను మంత్రి బయటపెట్టారు.టీడీపీవి అన్నీ తప్పుడు ఆరోపణలు. గవర్నర్‌కు మేము ఇచ్చినంత మర్యాద ఎవరూ ఇవ్వలేదని మంత్రి బుగ్గన వివరించారు. గవర్నర్‌కు స్వాగతం పలికిన వీడియోను ఆయన ప్రదర్శించారు. గవర్నర్ పట్ల గౌరవ సభ పట్ల అమర్యాదగా ప్రవరిస్తున్నారని, టీడీపీ తన వక్రబుద్ధిని మార్చుకోవాలని మంత్రి బుగ్గన హితవు పలికారు."అవాస్తవ ప్రచారాలపై స్పీకర్ కఠిన చర్యలు తీసుకోవాలి. ఎల్లో మీడియా కూడా బాధ్యతరహితంగా వార్తలు రాసింది. టీడీపీ వ్యవహారశైలి సభా హక్కుల ఉల్లంఘనే. తప్పుడు ఆరోపణలు చేసినవారితో పాటు అవాస్తవాలు ప్రచురించిన వారిపైనా తీవ్ర చర్యలు తీసుకోవాలి. అసత్య ప్రచారాలపై ప్రివిలేజ్ కమిటీకి రిఫర్ చేయాలి" అని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్పీకర్‌ను కోరారు.

# సంపాదకీయం

**గురువారం 16-03-2023**

## ఒత్తిడి లేని చదువుతో ప్రయోజనం

చదువుల వల్ల కొన్ని ఉపయోగాలు ఉన్నాయి, కానీ విద్యార్థులు కోరుకున్న జీవితాన్ని అది అన్నిసార్లు ఇవ్వలేదు. ఉదాహరణకు, ఎన్నో ఏళ్లు పగలనకా-రాత్రనకా కష్టపడి పనిచేసి, ఎన్నో అప్పులు చేసి, పైచదువులు చదివించాక కూడా చాలామందికి కోరుకున్న ఉద్యోగం దొరకట్లేదు "ఈమధ్య కాలంలో, యూనివర్సిటీ డిగ్రీ ఉన్న చాలామంది ఉద్యోగాలు దొరకక ఇబ్బంది పడుతున్నారు."కొంతమందికి కోరుకున్న ఉద్యోగం దొరికినా, సంతోషం మాత్రం ఉండట్లేదు. థాయ్‌లాండ్‌కి చెందిన నిరాన్ అనే వ్యక్తికి అలాంటి పరిస్థితే ఎదురైంది. అతను యూరప్‌లోని ఒక యూనివర్సిటీలో చదువు పూర్తి చేసుకుని తన దేశానికి తిరిగొచ్చాడు. చదువుకు తగ్గ ఉద్యోగం కూడా దొరికింది. అతను ఇలా అంటున్నాడు: "నేను అనుకున్నట్లుగానే, యూనివర్సిటీ డిగ్రీ ఉండడం వల్ల మంచి జీతం వచ్చే ఉద్యోగం దొరికింది. కానీ తీరిక లేనంత పని, రోజులో ఎక్కువ గంటలు ఆఫీసులోనే గడిచిపోయేవి. కొంతకాలానికి కంపెనీ వాళ్లు చాలామంది ఉద్యోగుల్ని పనిలో నుండి తీసేశారు, అలా నా ఉద్యోగం కూడా పోయింది. అప్పుడు నాకు ఒక విషయం అర్థమైంది, కష్టపడి ఎంత మంచి ఉద్యోగం సంపాదించినా అది ఎంతకాలం ఉంటుందో గ్యారెంటీ లేదు."కొన్నిసార్లు డబ్బున్నవాళ్లను చూసి 'వీళ్లకు ఏ కష్టం లేదు' అని అనుకుంటారు. నిజానికి వాళ్లకు కూడా సమస్యలు ఉంటాయి. వాళ్లకూ ఆరోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు ఉంటాయి. జపాన్‌లో ఉంటున్న కజూయా ఇలా అంటున్నాడు: "నాకు అన్నీ ఉన్నా సంతోషం మాత్రం ఉండేది కాదు. ఎందుకంటే వేరేవాళ్లు నన్ను చూసి అసూయపడేవాళ్లు, నన్ను ఎగతాళి చేసేవాళ్లు." వియత్నాంలో ఉంటున్న లామ్ అనే ఆవిడ ఇలా చెప్పింది: "ప్రశాంతంగా జీవించవచ్చు అనే ఉద్దేశంతో చాలామంది మంచి జీతం వచ్చే ఉద్యోగం కోసం కష్టపడతారు. కానీ వాస్తవం వేరు. అది ప్రశాంతతను ఇవ్వకపోగా, రకరకాల టెన్షన్‌లతో పాటు ఆరోగ్య సమస్యల్ని, మానసిక సమస్యల్ని తెచ్చిపెడుతుంది." చదువు పేరుతో కళాశాల యాజమాన్యం పెట్టే ఒత్తిడి భరించలేక, తక్కువ మార్కులు వస్తే తోటి విద్యార్థుల ముందు చేసే అవమానం భరించ లేక తరగతి గదిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడో ఇంటర్ విద్యార్థి. సరిగా చదవలేకపోతున్నానన్న బాధతో, మార్కులు తక్కువ వస్తాయన్న భయంతో, పరీక్ష తప్పుతానేమోనన్నఅనుమానంతో ఒక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. అంతకంటే ముందు సీనియర్ల వేధింపులు భరించ లేక మోడికో ప్రీతి తనువు చాలించింది.ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నెన్నో సంఘటనలు. ప్రతి రోజూ ఆత్మహత్యల వార్తలు మీడియాలో కనిపిస్తూనే ఉన్నాయి. దేశంలో ఆత్మహత్యల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. ముఖ్యంగా విద్యార్థులు, అందులోనూ టీనేజీ పిల్లల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. నేషనల్ క్రైమ్ బ్యూరో గణాంకాల ప్రకారం, దేశంలో చోటు చేసుకుంటున్న ప్రమాద మరణాలు, ఆత్మహత్యల్లో ఎనిమిది శాతానికిపైగా విద్యార్థులే కావడం విషాదం. అయితే విద్యార్థుల బలవన్మరణాలన్నీ వ్యవస్థ చేసిన హత్యలుగానే భావించాల్సి ఉంటుంది.స్వచ్ఛంగా జరగాల్సిన విద్యాబోధన.. మార్కులు, ర్యాంకుల వేటగా మార్చేసి..పిల్లలను వాటి వెంట పరుగులెత్తిస్తుండటమే వారిలో ఆత్మవిశ్వాసం లోపించడానికి కారణంగా చెప్పాలి. ఇష్టాయిష్టాలు, శక్తి సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా ర్యాంకులు, మార్కులే జీవితం అంటూ అగమ్య పోటీతత్వాన్ని పెంచేసే విధానమే పిల్లలలో ఆత్మహత్యలు పెరగడానికి కారణమని మానసిక నిపుణులు చెబుతున్నారు. అసలు విద్యా సంస్థల్లో సంస్కరణల కోసం ప్రభుత్వాలు తీసుకువచ్చిన చట్టాలు ఏ మేరకు అమలవుతున్నాయి? అసలు అమలు అవుతున్నాయా? అన్న సందేహాలు అందరిలోనూ వ్యక్తమౌతున్నాయి. ఈ పరిస్థితికి విద్యాసంస్థలు, అధ్యాపకులు, నిబంధనల రూపకర్తలు, సమాజం కూడా కారణమనే చెప్పాల్సి ఉంటుంది.విద్యను, విద్యాబోధనను సంస్కరించాలి. ఈ సంస్కరణల్లో తల్లితండ్రులు, అధ్యాపకులు, అధికారులు భాగస్వాములు కావాలి. ప్రధానంగా విద్యా బోధనను, విద్యా సంస్థలను వాణిజ్యమయం కాపాడాలి. అలాగే విద్యార్థుల మధ్య కుల, మత, లింగ వివక్ష లేకుండా చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో ఇప్పటికీ ప్రభుత్వాలు ఒక నిర్దిష్ట కార్యాచరణను రూపొందించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోకుండా ముందు ముందు మరింత భారీ మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది.

# ఐదున్నర లక్షకోట్లు దాటేసిన అప్పులు

విజయవాడ, మార్చి 15,ఆంధ్ర ప్రదేశ్ అప్పులు రూ.5,50,650 కోట్లు ఉన్నాయి. ఏటేటా ఈ మొత్తం పెరుగుతూనే ఉంది. ఇందులో బహిరంగ మార్కెట్ నుంచి తెచ్చిన రుణాలతోపాటు, కేంద్రం నుంచి తెచ్చిన రుణాలు, ఇతర సంస్థల ద్వారా సమీకరించిన రుణాలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చిన గ్యారంటీ రుణాలు కూడా ఉన్నాయి.గ్యారంటీల ద్వారా తీసుకొచ్చిన రుణాలు మినహాయిస్తే మిగిలిన అప్పులు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 33.94 శాతంగా ఉన్నట్లు లెక్క తేలింది. 2014లో రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి ఇప్పటివరకు రుణాల లెక్కలను ఏపీ ప్రభుత్వం ఖరారు చేసింది.రుణాల్లో ప్రభుత్వ సెక్యూరిటీలను రిజర్వు బ్యాంకు వద్ద తనఖా పెట్టడం ద్వారా తీసుకున్న బహిరంగ మార్కెట్ రుణాలు రూ.2,04,033 కోట్లుగా ఉన్నాయి. ఈ అప్పులు ఫిబ్రవరి 14వ తేదీ వరకు తీసుకున్నవి.ఆ తర్వాత నెల రోజుల వ్యవధిలో మరిన్ని రుణాలను రాష్ట్ర ప్రభుత్వం వివిధ మార్గాల్లో సేకరించింది.ప్రభుత్వం నుంచి తీసుకున్న రుణాలు రూ.20,962 కోట్లు, ఇతర సంస్థల నుంచి సంక్షేమ పథకాల అమలు కోసం తీసుకున్న రుణాలు రూ.18,079 కోట్లు, చిన్న మొత్తాల పొదుపు సంస్థల నుంచి తీసుకున్న రుణాలు రూ.8227 కోట్లు, ప్రావిడెండ్ ఫండ్ నుంచి తీసుకున్న రుణాలు రూ.29,236 కోట్లు, డిపాజిట్లు ద్వారా సేకరించిన రుణాలు రూ.51,719 కోట్లుగా ఉన్నాయి.2014 నుంచి జీఎస్‌డిపిలో రుణాల శాతం క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2014-15లో 28.25 శాతంగా ఉన్న రుణం తరువాత కొంత తగ్గుముఖం పట్టగా, 2019-20 నుంచి పెరగడం ప్రారంభించింది. ఆ సంవత్సరం 31.02 శాతానికి చేరుకున్న రుణం మరుసటి ఏడాది 35.53 శాతానికి చేరుకుంది. 2021-22లో 31.46 శాతానికి ఉన్న రుణం, ఈ ఏడాది ఫిబ్రవరికి అప్పుల వాటా స్థూలరాష్ట్ర ఉత్పత్తిలో 33.94 శాతానికి చేరుకుంది. ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చే గ్యారంటీల ద్వారా వచ్చిన రుణాలు కూడా ప్రస్తుతం రూ.1,18,394 కోట్లుగా ఉన్నాయి. ఈ రుణాల్లో పౌర సరఫరాల సంస్థ దగ్గర రూ.31 వేల కోట్లకు అప్పులున్నాయి. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మరో రూ.18,115 కోట్లు రుణంగా తీసుకున్నారు. రుణాల సమీకరణ కోసమే ఏర్పాటుచేసిన ఏపి రాష్ట్రాభివృద్ధి సంస్థ తీసుకున్నవి రూ.22,504 కోట్లు ఉన్నాయి. ఇవి కాకుండా నబార్డు ద్వారా వివిధ పథకాలకు మరో రూ.8,367 కోట్లు రుణంగా తీసుకున్నారు.2014 నాటికి ఆంధ్రప్రదేశ్ అప్పులు రూ.97,177కోట్లు ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత తొలి ఏడాది అప్పులు రూ.1,48,743కోట్లకు చేరాయి. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అప్పుల వాటా 28.25శాతం ఉండేది.2015-16లో అప్పులు రూ.1,69,458కోట్లకు పెరిగాయి. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అప్పుల వాటా 27.97శాతానికి పరిమితమైంది. 2016-17లో రూ.1,94,862కోట్లకు అప్పులు చేరాయి. జీఎస్‌డిపిలో అప్పుల వాటా 27.83శాతానికి చేరాయి. 2017-18లో అప్పులు 2,23,706కోట్లకు అప్పులు చేరుకున్నాయి. ఆ తర్వాత ఏడాది 2018-19లో 2,57,510కోట్లకు అప్పులు చేరుకున్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి ఏడాది 2019-20లో అప్పులు 3,01,802కోట్లకు చేరుకున్నాయి. జీఎస్‌డిపిలో అప్పులు 31.02శాతానికి చేరాయి. 2020-21లో అప్పులు 3,50,557కోట్లకు చేరుకున్నాయి. స్థూల ఉత్పత్తిలో అప్పుల వాటా 35శాతం దాటింది. 2021-22లో రూ.3,78,087కోట్లకు అప్పుల భారం చేరింది. 2022-23లో 4,32,257కోట్లకు ఏపీ అప్పులు చేరాయి. వచ్చే ఏడాది నాటికి 5లక్షల కోట్లకు చేరువలో అప్పులు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

# టీడీపీకి చివరి నిమిషం ఆశలు

విజయవాడ, మార్చి 15,మ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు ఏకగ్రీవం అవుతాయని అంతా భావించారు. మొత్తంగా ఏడు స్థానాలు ఖాళీ అవుతోంటే.. వాటికి అభ్యర్థులను కూడా చాలా ముందుగానే వైసీపీ ప్రకటించింది. ఎవ్వరూ ఊహించని విధంగా టీడీపీ ఈ ఎన్నికల రణ రంగంలోకి దూకింది. పూర్తిస్థాయిలో సంఖ్యాబలం టీడీపీ దగ్గర లేదు. కానీ.. తమ లెక్కలు తమకు ఉన్నాయనేది టీడీపీ వాదన. విజయవాడ మాజీ మేయర్ పంచుమర్తి అనురాధతో నామినేషన్ వేయించింది.అధికారికంగా టీడీపీ సంఖ్యాబలం 23. అయితే నలుగురు ఎమ్మెల్యేలు వైసీపీలోకి జంప్ అయ్యారు. కరణం బలరాం, వల్లభనేని వంశీ, మద్దాల గిరిధర్, వాసుపల్లి గణేష్ అధికారపార్టీ గూటికి చేరుకున్నారు. వీరి ఓట్లు ఎలాగూ టీడీపీకి పడే ఛాన్స్ తక్కువే. ఒకవేళ టీడీపీ విప్ జారీ చేసినా.. ఏదోక మాయ చేసి ఆ ఓట్లు చెల్లుబాటు కాకుండా.. రెబెల్స్ ప్రయత్నించొచ్చు. ఈ క్రమంలో టీడీపీకి పక్కాగా పడే ఓట్లు కేవలం 19 అనే చెప్పాలి. ఇంత తక్కువ ఓట్లతో ఎమ్మెల్సీ స్థానాన్ని ఎలా గెలుచుకుంటారనేది ప్రస్తుతం ప్రశ్న. అయితే టీడీపీ గణాంకాలు వేరే విధంగా ఉన్నాయట. ఎమ్మెల్సీగా గెలుపొందాలంటే 2188.5 పాయింట్స్ కావాలి. టీడీపీకి 19 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఉండటంతో.. 1900 పాయింట్లే పడతాయి. ఇక్కడే టీడీపీ అధినేత చంద్రబాబు మరో ప్లాన్ వేస్తున్నారట. వైసీపీ రెబెల్స్‌గా ఉన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి వంటి వారు టీడీపీ అభ్యర్థికి ఓటేస్తే 2100 పాయింట్లు దక్కుతాయి. అప్పుడు ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవాలంటే టీడీపీ ఇంకా 88.5 పాయింట్ల కొరత ఉంటుందని అనుకుంటున్నారు.కొరతలో ఉన్న 88.5 పాయింట్లను భర్తీ చేయాలంటే కచ్చితంగా మరో ఎమ్మెల్యే కావాలి. ఈ పరిస్థితుల్లో టీడీపీకి సహకరించే వైసీపీ ఎమ్మెల్యే ఎవరైనా ఉన్నారా..? లేక ట్రై చేసి చూద్దామనే ఉద్దేశ్యంతో చంద్రబాబు పోటీకి నిలబెట్టారా..? అనే చర్చ జరుగుతోంది. టీడీపీ అధిష్టానం మదిలో ఓ వ్యూహం ఉందట. చివరి నిమిషంలో అద్భుతాలు జరుగుతాయని చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో మరో అంశమూ ప్రస్తావనకు వస్తుంది. వైసీపీ ఎమ్మెల్యేల్లో ఎవరో ఒకరు రాంగ్ ఓటింగ్ చేయకపోతారా? వాళ్ల ఓటు మురిగిపోకుండా ఉంటుందా..? అనే ఆశ.. ఆలోచనలతో అభ్యర్థిని సిద్ధం చేస్తున్నారటఅయితే ఇంత ప్రయాసపడి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం దేనికనే చర్చా నడుస్తోంది. అభ్యర్థిగా బీసీ సామాజికవర్గానికి చెందిన మహిళ నేతను ఎంపిక చేశారు. తమ ప్లాన్ వర్కవుట్ అయి.. గెలిస్తే సరేసరి.. లేకుంటే బీసీ.. అందులోనూ మహిళను ఇబ్బంది పెట్టారనే విమర్శలు వస్తాయని కొందరు ఆందోళన చెందుతున్నారట. ఇది కొత్త పంచాయితీకి దారితీస్తుందని చెబుతున్నారు. గతంలో వర్ల రామయ్యను కూడా ఇదే విధంగా రాజ్యసభకు అభ్యర్థిగా నిలిపి విమర్శల పాలైన అంశాన్ని గుర్తు చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు రాజ్యసభ, శాసనమండలి సీట్లు ఇవ్వకుండా.. ఓడిపోతామని తెలిసి మరీ ఆ టికెట్లను బీసీలకు ఇచ్చారనే విమర్శలు వస్తాయని భయపడుతున్నారట. మరి.. ఈ విషయంలో టీడీపీ వ్యూహం వర్కవుట్ అవుతుందో బెడిసి కొడుతుందో కాలమే చెప్పాలి.

# ఎన్ ఐఏ కోర్టుకు రండి

విజయవాడ, మార్చి 15, ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏప్రిల్ పదో తేదీన విజయవాడలోని ఎన్ఐఏ కోర్టుకు హాజరు కానున్నారు. ఆ రోజున హాజరు కావాలని ఎన్ఐఏ కోర్టు ఆదేశాలు జారీ చేసింది జగన్ తో పాటు ఆయన పిఏ నాగేశ్వరరరెడ్డికి కూడా ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఏపి సిఎం జగన్‌పై విశాఖ ఎయిర్ పోర్టులో జరిగిన దాడి ఘటనపై విజయవాడ ఎన్ఐఏ కోర్టులో విచారణ జరుగుతోంది. బాధితుడు కూడా ఖచ్చితంగా విచారణకు హాజరు కావాలని గతంలో ఎన్ఐఏ కోర్టు ఆదేశించింది. బాధితుడు కూడా విచారణకు హాజరు కావాలని షెడ్యూల్ ఇవ్వాలని ఆదేశించింది. ఇప్పటికి షెడ్యూల్ ఖరారయింది. ఏప్రిల్ పదో తేదీన హాజరు కానున్నారు. ఘటన జరిగినప్పటి నుండి నిందితుడు శ్రీనివాసరావు జైల్లోనే ఉన్నారు. బెయిల్ కూడా రాలేదు. దాడికి వాడిన కోడి కత్తి గురించి న్యాయమూర్తి గత విచారణలో ఆరా తీశారు. దానిని తమ ముందు ప్రవేశ పెట్టాలని దర్యాప్తు అధికారుల్ని ఆదేశించారు. అయితే? కోడి కత్తి మిస్ అయినట్లుగా ప్రచారం జరుగుతోంది. 2019లో వైజాగ్ ఎయిర్ పోర్టులో అప్పటి విపక్ష నేత ప్రస్తుత సిఎం జగన్‌పై కోడి కత్తితో జనిపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. అప్పట్లో జగన్ ఉత్తరాంధ్ర ప్రాంతంలో పాదయాత్ర చేస్తున్నారు. ప్రతి శుక్రవారం ఆయన కోర్టుకు హాజరవ్వాల్సి ఉండేది. అందుకే ప్రతి గురువారం మధ్యాహ్నం కల్లా ఆయన పాదయాత్ర నిలిపివేసి వెంటనే విశాఖ ఎయిర్ పోర్టు నుంచి హైదరాబాద్ బయలుదేరేవారు. ఇలా ఎయిర్ పోర్టుకు వచ్చిన సమయంలో ఎయిర్ పోర్టు క్యాంటీన్‌లో పని చేసే శ్రీను అనే వ్యక్తి విఐపి లాంజ్‌లోకి వెళ్లడానికి అవకాశం దొరకబుచ్చుకున్నాడు. టీ, కాఫీలు అందించే ఉద్దేశంతో వెళ్లాడు. కోడికత్తితో దాడి చేశాడు. చిన్న గాయం కావడంతో వెంటనే జగన్ విమానం ఎక్కి వెళ్లిపోయారు. నీ హైదరాబాద్ చేరుకున్న తరవాత సిటీ న్యూరో ఆస్పత్రిలో చేరారు. ఆ ఆస్పత్రి వైద్యులు తొమ్మిది కుట్లేసినట్లుగా ప్రకటించారుఇది పెద్ద సంచలనం అయింది. శీను జగన్ అభిమాని అని జగన్‌పై సానుభూతి రావడం కోసం చేశారని పోలీసులు తేల్చారు. అయితే వైసిపి నేతలు ఇందులో టీడీపీ నేతల కుట్ర ఉందని ఆరోపించి.. ఎన్ఐఏ విచారణకు ఆదేశాలు తెచ్చుకున్నారు. ఆ కేసుని చేతుల్లోకి తీసుకున్న ఎన్ఐఏ కోడికత్తి శీనును జైలుకు పంపి కాస్త విచారణ జరిపి నిజమేంటో దర్యాప్తు చేస్తోంది. ఎన్ఐఏ అప్పటి నుంచి దర్యాప్తు కొనసాగిస్తునే ఉంది. ఈ కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాస్‌కు బెయిల్ ఇప్పించాలని అతని కుటుంబ సిఎం జగన్‌కు విజ్ఞప్తి చేసింది. జైల్లో రిమాండ్ ఖైదీ గానే ఉన్న జనిపల్లి శ్రీనివాస్‌కు బెయిల్ కోరుతూ అతని కుటుంబ సభ్యులు చేసుకున్న దరఖాస్తులను ఇప్పటికే కోర్టు కొట్టి వేసింది. బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే క్రమంలో జగన్ నుంచి నిరభ్యంతర పత్రం కోసం శ్రీను తల్లితండ్రులు సిఎం క్యాంపు కార్యాలయానికి తిరుగుతునే ఉన్నారు. అయినా జగన్ నుంచి ఎటువంటి స్పందనాలేదు.

# ల్యాండ్ ఫర్ జాబ్ స్కామ్ కేసులో లాలూకు బెయిల్

ఢిల్లీ ల్యాండ్ ఫర్ జాబ్ స్కామ్‌లో భాగంగా ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో హాజరయ్యారు బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్. ఆయనతో పాటు రబ్రీదేవి సహా ఆరోపణలు ఎదుర్కొంటున్న 14 మంది కోర్టుకు వచ్చారు. విచారణ తరవాత లాలూ, రబ్రీ దేవి, ఎంపీ మీసా భారతికి కోర్టు బెయిల్ ఇచ్చింది. రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసింది. మార్చి 29వ తేదీన మరోసారి విచారించనున్నట్టు ప్రకటించింది కోర్టు. లాలూ, రబ్రీ దేవి, మీసా భారతి కోర్టుకి వచ్చి జడ్జ్ ముందు హాజరయ్యారు. ఆ వెంటనే ఈ ముగ్గురూ బెయిల్ పిటిషన్ వేశారు. దీన్ని పరిశీలించిన కోర్టు రూ.50 వేల పర్సనల్ బాండ్‌పై బెయిల్ ఇస్తున్నట్టు వెల్లడించింది. బీజేపీ మాత్రం ఈ విషయంలో లాలూపై తీవ్ర విమర్శలు చేస్తోంది. కొందరు ఆర్జేడి నేతలు తమపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ కేసుపై చర్చ జరుగుతోంది. లాలూ కుటుంబాన్ని టార్గెట్ చేశారని కొందరు వాదిస్తున్నారు. లాలూకి బెయిల్ రావడంపై ఆర్జేడి నేతలు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ నేతలకు మిఠాయిలు పంచారు. దీనిపై అసహనం వ్యక్తమైంది. ఇరు వర్గాలు లడ్డూలు ఒకరిపై ఒకరు విసురుకున్నారు. 2004-09 మధ్య కాలంలో లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా పని చేశారు. ఆ సమయంలోనే గ్రూప్ డి ఉద్యోగాలు ఇచ్చేందుకు పెద్ద ఎత్తున స్థలాలు తమ పేరిట రాయించుకున్నారన్న ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రిక్రూట్‌మెంట్ చేశారని సీబీఐ చెబుతోంది. జనరల్ మేనేజర్ స్థాయి వ్యక్తుల్నీ రిఫరెన్స్ ద్వారా రిక్రూట్ చేశారని అంటోంది. లాలూని రెండు గంటల పాటు ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఈ విచారణ మొత్తాన్ని వీడియో తీసింది ఈడీ. ఇప్పటికే సీబీఐ ఈ కేసుకు సంబంధించి ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఇందులో లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవితో పాటు మొత్తం 14 మంది పేర్లు చేర్చింది.

## నిండు గర్భిణీ నరకయాతన

ఏలూరు, మార్చి 15,న్ని ప్రభుత్వాలు మారినా గిరిజనుల జీవితాల్లో మాత్రం వెలుగులు ప్రసరించడం లేదు. గిరిజనులు నడవడానికి కూడా రోడ్డు సౌకర్యం అందడం లేదు. దీంతో గిరిజనులు, ముఖ్యంగా గర్భిణీలు నానా కష్టాలు పడుతున్నారు. ఒక్కోసారి ప్రసవం కోసం కిలోమీటర్లు నడిచి కడుపులో బిడ్డను కోల్పోయి కడుపుకోతను అనుభవిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గర్భిణీల డోలి మోతలు తప్పడం లేదు. తాజాగా అనంతగిరి మండలం పెనకోట పంచాయతీ రాచకీలం కొండపై గ్రామంలో సూకూరు లక్ష్మి(20) అనే గర్భిణీకి ఆదివారం పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే 108 కి ఫోన్ చేశారు.అయితే ఆ గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో గర్భిణీని రోడ్డు మార్గం తెమ్మన్నారు. దీంతో కొండపైనుంచి రాచకిలం నుంచి గుమ్మంతి వరకు నాలుగు కిలోమీటర్ల మేర రాళ్లు, రప్పలు, ఎత్తైన కొండ మార్గం నుంచి మైదాన ప్రాంతం గుమ్మంతి వరకు ఆమెను డోలిపై మోసుకుని అంబులెన్సు వద్దకు వచ్చారు. అంబులెన్సులో ఆమెను పినకోట ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. అయితే అక్కడ వైద్యులు లేకపోవటం వల్ల ఆమెను కే.కోటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అక్కడ వైద్యుల సూచన మేరకు ఆమెను విశాఖ కేజీహెచ్ కు తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడే చికిత్స పొందుతోంది. గత ఏడాది సెప్టెంబర్ లో డోలిపై ఇద్దరు రోగులను తరలించడంతో వారు చికిత్స పొందుతూ మృతి చెందారు.తమ గ్రామాలకు రోడ్డు లేకపోవటం వల్ల ఎలాంటి వైద్య సేవలు కావాలన్నా.. డోలి మోతలే గత్యంతరం అని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు తమ అనుమతులు లేనిదే శ్రమదానం చేసి రహదారి నిర్మిస్తే.. కేసులు పెడతామని బెదిరించినట్లు గ్రామస్థులు వాపోతున్నారు. అయితే అప్పటినుంచి శ్రమదానంతో రహదారి పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం నిర్మించదని, తాము రోడ్డు వేసుకుంటామంటే అటవీ అధికారులు అడ్డుతగలడం దారుణం అంటున్నారు గ్రామస్తులు. ఇంకా ఎన్ని ప్రాణాలు పోవాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అరటి గెలలకు ..ధర... అధరహో

రాజమండ్రి, మార్చి 15, టి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్, ఎగువ రాష్ట్రాల్లో అరటి దిగుబడులు లేకపోవడంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం టన్ను అరటి ధర రూ.24 వేలకు చేరింది. గత సీజన్‌లో టన్ను రూ.16 వేల నుంచి రూ.18 వేలకు వరకూ పలికింది. ప్రస్తుతం అరటికి మంచి ధర ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత మూడేళ్లలో ఈ ధరే అత్యధికమని వారు చెబుతున్నారు. దేశంలో అత్యధికంగా అరటి సాగు జరిగే మహారాష్ట్ర, బీహార్, ఒడిశా, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో దిగుబడులు ఆశించిన స్థాయిలో లేవు. దీంతో, రాష్ట్రంలోని అరటికి ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, అంబాజీ పేట మండలాల్లో విస్తారంగా అరటి సాగవుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం, తాళ్లపూడి మండలాలు అరటి సాగుకు పెట్టింది పేరు. ఈ రెండు జిల్లాల్లో మరో ఎనిమిది మండలాల్లో అక్కడక్కడా అరటి సాగవుతోంది. అధికారుల గణాంకాల ప్రకారం ఈ రెండు జిల్లాల్లో సుమారు 45 వేల ఎకరాల్లో అరటి తోటలు ఉన్నాయి. ఈ సీజన్‌లో సుమారు ఎనిమిది లక్షల టన్నుల వరకూ దిగుబడి వస్తుందని అధికారుల అంచనా వేశారు. ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతోంది. 15 నుంచి 17 టన్నుల వరకూ దిగుబడి వస్తోంది.ఈ లెక్కన ఎకరాకు రూ.2 లక్షల వరకూ లాభం రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ ధర ఎంతకాలం ఉంటుందో చూడాలని వారంటున్నారు.రావులపాలెం, పెరవలి అరటి మార్కెట్లు ఉన్నాయి. ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ఈ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. గతంలో వంద నుంచి 120 లారీల్లో ఇక్కడ నుంచి అరటిని ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో రోజుకు 200 నుంచి 250 వరకూ లారీల్లో అరటిని ఎగుమతి చేస్తున్నారు. ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, కోల్‌కత్తా తదితర ఉత్తరాది రాష్ట్రాలకు ప్రతి రోజూ అరటి ఎగుమతులు జరుగుతున్నాయి.ఐదు ఎకరాల్లో కర్పూర రకం అరటి సాగు చేస్తున్నాను. పది రోజులుగా అరటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గతంలో టన్ను అరటి రూ.16 వేలు ఉండేది ప్రస్తుతం రూ.24 వేల వరకూ పలుకుతోంది. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు తోటల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మరో నెల రోజుల పాటు ఈ ధరలు ఉంటాయని అంచనా. కొంతకాలంగా నష్టాల్లో ఉన్న అరటి రైతులకు ఈ ధరలు కొంత ఊరటనిచ్చాయి.పెళ్లిళ్ల సీజన్ కావడంతో రావుల పాలెం, తాడేపల్లి గూడెం, రాజమహేం ద్రవరం మార్కెట్లలోనూ విడి గెలలకుడిమాండ్ పెరిగింది. ఒక అరటి గెల రూ.250 నుంచి రూ.300 చొప్పున పలుకుతోంది. గతంలో గెల రూ.100లోపునే అమ్ముకోవాల్సి వచ్చేది. ఏడాదిలో ఒక నెల మాత్రమే డిమాండ్ ఉంటుంది. ఇతర సమయాల్లో తక్కువ ధరకు విక్రయించక తప్పడం లేదు. ప్రభుత్వం అరటిని నిల్వ చేసుకునే సౌకర్యాలు కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు



## కాలేజీ గేటుకు తాళం..విద్యార్థుల అవస్థలు

నెల్లూరు నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో విద్యార్థులు లోపలికి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. కాలేజీ భవనం గేటు తీయకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా ఉండిపోయింది. దానికున్న చిన్న సందులో నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి వెళ్లారు. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. గేటుకు తాళం వేసిన వాచ్మెన్ ఎక్కడికో వెళ్లాడని.. తాళం చెవి అతని దగ్గరే ఉంటడంతో అతని కోసం వెతుకుతున్నామని సమాధానం చెప్పారు.

## మందుబాబుల ఘర్షణలో వ్యక్తికి గాయాలు

ఒంగోలు మందుబాబుల మధ్య చోటుచేసుకున్న వివాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మార్కాపురం పట్ట ణంలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఎన్ఎస్ నగర్కు చెందిన ఉప్పలపాటి నాగరాజు, సుంకేసులకు చెందిన కె. రామి రెడ్డి, కె.రోశిరెడ్డి.... కంభం రహదారిలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్లో వేర్వేరుగా మద్యం తాగారు. ఆ మత్తులో రామిరెడ్డి, రోని రెడ్డి... నాగరాజుతో గొడవపడి చాకుతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన నాగరాజును మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలిం చారు.

# ఈ సారి ఎండలు ఎక్కువే



విజయవాడ, మార్చి 15, వడగాలులు, ఉపశమన చర్యలపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అంబేడ్కర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ అంబేడ్కర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సీజనల్ ఔట్ లుక్-2023 ప్రకారం ఈ వేసవిలో... వాతావరణంలోని మార్పులు, గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుందని, సముద్రానికి దగ్గరగా ఉండటం వలన ఏపీలో వడగాల్పులు ఎక్కువగా వీస్తాయని తెలిపారు. అలాగే ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని స్పష్టం చేశారు. ఐఎండీ అంచనా ప్రకారం గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సాధారణం కంటే కొద్దిగా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు తెలిపారు. ఎన్డీఎంఏ మార్గదర్శకాల ప్రకారం వడగాల్పులపై ప్రణాళిక విపత్తుల నిర్వహణ సంస్థ రూపొందించనుంది. దీనిలో ప్రభుత్వ శాఖల వారీగా అమలు చేయనుంది. 2016లో 723 , 2017లో 236, 2018లో 8, 2019లో 28 వడగాల్పుల మరణాలు నమోదు అయ్యాయి. విపత్తుల సంస్థ, జిల్లా యంత్రాంగం సమన్వయ చర్యలతో 2020, 21, 22లో వడగాల్పుల మరణాలు అసలు సంభవించలేదని అధికారులు తెలిపారు. జిల్లాల్లోని సంబంధిత శాఖల అధికారులు ఈ సంవత్సరం అదే కృషితో ప్రాణనష్టం లేకుండా ఉండేట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లకు, ప్రభుత్వ శాఖల అధికారులకు విపత్తుల నిర్వహణ సంస్థ పలు సూచనలు జారీచేసింది.జిల్లా, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలి. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, పని ప్రదేశాల్లో చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ప్రారంభించే విధంగా ఔఊూలు, కమ్యూనిటీ గ్రూప్స్, ఇతర సంస్థలను కోరాలి.బహిరంగ ప్రదేశాల్లో అవగాహన పోస్టర్లను ప్రదర్శించడం, టీవీల్లో స్క్రోలింగ్ చేయడం, థియేటర్లలో వీడియోలు ప్లే చేయడం, కరపత్రాల పంపిణీ మొదలైన వాటి ద్వారా వడగాల్పుల సమాచారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. క్షేత్రస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయల్లో పోస్టర్లతో అవగాహన కల్పించాలి వడగాల్పుల తీవ్రతను బట్టి పాఠశాల సమయాలను మార్పు లేదా మూసివేయాలి.వైద్య శిబిరాలు నిర్వహించడం, ఏాఖీూ ప్యాకెట్లు, ఇతర మెడిసిన్లు తగినంత స్టాక్ ఏర్పాటు చేసుకోవాలి .కీలకమైన సౌకర్యాలకు (ఆసుపత్రులు, ఒఊఅలు వంటివి) నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యుత్ సంస్థలను కోరారు.ఎండాలు, వర్షాలు కూడా అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే విభాగాన్ని విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ ఏమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ లో ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లా యంత్రాంగానికి నాలుగు రోజుల ముందు హీట్ ఇండెక్స్, రెండు రోజుల ముందుగా ఉష్ణోగ్రత వివరాలు, వడగాలుల తీవ్రతపై సూచనలు జారీ చేయనున్నట్లు చెప్పారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే జిల్లాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఐఎండీ సూచనల మేరకు విపత్తుల నిర్వహణ సంస్థ తగు చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు ముందస్తుగా హెచ్చరికలు జారీ చేసి ప్రాణనష్టాన్ని తగ్గిస్తుందన్నారు. వడగాల్పుల తీవ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విపత్తుల సంస్థ హెచ్చరిక సందేశాలు ప్రజలకు పంపనున్నట్లు చెప్పారు. ఎండలతోపాటు అప్పుడప్పుడు క్యుములోనింబస్ మేఘాల వలన వర్షాలతో పిడుగులు పడే అవకాశం ఎక్కువ ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# పాపం...రోజా...



తిరుపతి, మార్చి 15,మంత్రి రోజా అందరిలాంటి నాయకురాలు కాదు. ఫైర్ బ్రాండ్ లీడర్.. అది వెండితెర అయినా, బుల్లి తెర అయినా, రాజకీయ వేదికే అయినా ఆమె నోరు తెరిస్తే... నిప్పుల వర్షం కురుస్తుది. అవతలి వారు ఎంతవారైనా రోజా డోంట్ కేర్. తగ్గేదే లే .. కడిగేయడమే కానీ, కన్నీళ్లు పెట్టుకోవడం గతంలో ఎరగరు. కానీ ఇప్పుడు ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. అవును, జబర్దస్త్ గా నవ్వడమే కానీ, ఏడుపు అన్నది ఎరుగని మంత్రి రోజా.. భోరు భోరున విలపించారు. అంటే ఏడ్చారు. అవును అలుగుటయే యెరుంగని మహామహితాత్ముడు అజాతశత్రువే అలిగిననాడు, అన్నట్లు ఏడుపే ఎరుగని మంత్రి రోజా, నిజంగా కన్నీరు పెట్టుకున్నారు. విలపించారు. జబర్దస్త్ రోజా ఏమిటి? ఏడవడం ఏమిటీ? అంటే అందుకో కథ, కారణం ఉంది. సోషల్ మీడియాలో రోజా ఏడుపుకు చాలా చాలా రీజన్స్ వినిపిస్తున్నాయి. రాజకీయ ప్రయాణంలో తాను ఎదుర్కున్న చేదు అనుభవాలను గుర్తుచేసుకుని, రోజా కన్నీరు పెట్టుకున్నారు...ట. అన్నిటినీ మించి, తనది, 'ఐరెన్ లెగ్' అని ప్రత్యర్ధులు చేసిన, చేస్తున్న విమర్శలు ఆమెను ఎంతగా బాధిస్తున్నాయో ఆమె విపులంగా చెప్పుకొచ్చారు. అలా చెప్పుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇప్పుడు, ఆ 'పుష్ప విలాపం' వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే రోజా ఏడుపుకు, ఆమె రాజకీయాల్లో చవిచూసిన సినిమా కష్టాలే కారణమా? లేక ఇప్పుడు వైసీపీలో వినిపిస్తున్న 'ఐరన్ లెగ్' కామెంట్స్ కారణమా? అంటే సినిమాల్లో హిరోయిన్‌గా కెరీర్ ప్రారంభించి, తెలుగుదేశం పార్టీలో చేరి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ని సైతం డోంట్‌కేర్ అన్నపద్ధతిలో తిట్టిపోసిన రోజా, తర్వాత అదే వైఎస్ కుమారుడు జగన్ రెడ్డి పెట్టిన పార్టీ వైసీపీలో చేరి రెండు సార్లు ఎమ్మెల్యే అయ్యారు. ఇప్పుడు మంత్రిగా ఉన్నారు. సో.. రాజకీయాలల్లో ఆమె పడిన కష్టాలు పెద్దగా లేవు. ఒక విధంగా ఆమె రాజకీయ వైకుంఠపాళీలో పాములను తప్పించుకుని కొంచెం వేగంగానే నిచ్చెనలు ఎక్కారు.తెలుగు దేశం పార్టీలో చంద్రగిరి నుంచి రెండుసార్లు పోటీ చేసి రెండు సార్లూ ఓడి పోయిన తర్వాత ఆమె కోరుకున్న సీటు (నగరి) రాక, 2009 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిని కలిశారు. అయితే, ఆ తర్వాత కొద్ది రోజులకే వైఎస్ హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారు. దాంతో ఆమె కాంగ్రెస్ లో చేరలేక పోయారు. అప్పట్లోనే రోజా అంటే గిట్టని వాళ్ళు, అమెది ఐరన్ లెగ్ అంటూ ఎగతాళి చేయడం ప్రారంభించారని అంటారు.ఆ తర్వాత ఆమె వైసీపీలో చేరి నగిరి నుంచి రెండు సార్లు గెలిచారు. అయినా 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినా ఆమెకు తొలి విడతలో మంత్రి పదవి దక్కలేదు. గత సంవత్సరం (2022) ఏప్రిల్ లో జరిగిన మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణలో ఆమెకు ఎట్టకేలకు మంత్రి పదవి దక్కింది, కానీ, ఈసారి ఎన్నికలలో పోటీ చేసేందుకు పార్టీ టికెట్ దక్కే ఛాన్స్ లేదంటున్నారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గడప గడపకు సమీక్ష సమయంలో అందరి ముందు వార్నింగ్ ఇచ్చిన మంత్రులలో రోజా పేరు కూడా వుంది. అదీ గాక నియోజకవర్గంలో ఆమెకు ఎదురు గాలి వీస్తోందనే ప్రచారం జరుగుతోంది. స్థానిక వైసీపీ నాయకులు కూడా అభ్యర్థిని మార్చాలని బహిరంగంగా డిమాండ్ చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో రోజాను తప్పించి స్థానికంగా అందుబాటులో ఉండే అభ్యర్థికి టిక్కెట్ ఇవ్వాలనే వాదనలు వినిపిస్తున్నారు.ఆ ఫ్రస్ట్రేషన్ లోనే రోజా... తనను ఐరన్ లెగ్ అంటున్నారని.. కన్నీళ్లు పెట్టుకున్నారని అంటున్నారు. అయితే అవి నిజం కన్నీరా, సానుభూతి కోసం పెట్టుకున్న గ్లిజరిన్ కన్నీరా.. అంటే ఎంతైనా నటి కదా ... గ్లిజరిన్ కన్నీళ్లు అయినా కావచ్చును అంటున్నారు.

## తడ,సూళ్లూరుపేట లో దొంగలు హల్ చల్

**అంతరాష్ట్ర దొంగల ముఠా గా అనుమానం**

**షాపులనే టార్గెట్టుగా చోరీ యత్నాలు**

**ఐదుగురు దొంగలు ఉన్నట్లు అనుమానం**

నెల్లూరు సూళ్లూరుపేట , తడ పట్టణాలలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్ చల్ చేశారు. సూళ్లూరుపేట పట్టణం లో మూడు చోట్ల చోరీకి విఫలయత్నం చేశారు, అలాగే తడ లో కూడా మూడు చోట్ల చోరీకి ప్రయత్నించారు. సూళ్లూరుపేట లోని మోర్ సూపర్ మార్కెట్ షెట్టర్ తాళాలు పగలగొట్టి అద్దాలను బండరాళ్లతో కొట్టి లోనికి ప్రవేశించి ఉన్నారు. లోపల కంప్యూటర్ల క్రింద ఉండే కాష్ డ్రాలను పగలకొట్టే ప్రయత్నం చేశారు. అలాగే వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్నకేకే పాన్ బ్రోకర్స్ షాపు తాళాలు కూడా పగలగొట్టారు కానీ లోనికి వెళ్లలేక పోయారు. దానికి ఎదురుగా ఉన్న పాత అష్టలక్ష్మి సూపర్ మార్కెట్ షెట్టర్ తాళాలు కూడా పగలగొట్టి చోరీకి ప్రయత్నించి ఉన్నారు, తమిళనాడు కు చెందిన ఐదుగురు దొంగలు ఇలా హల్ చల్ చేసినట్లు సీసీ కెమెరాలలో రికార్డు ఐన వీడియోను బట్టి తెలుస్తుంది. చెన్నై నుండి ముందుగా తడ లో చోరీలకు ప్రయత్నించి అనంతరం సూళ్లూరుపేట లోకూడా చోరీలకు పాల్పడినట్లు తెలుస్తుంది. తడ లో రెండు చోట్ల చోరీకి విపలయత్నం చేసిన దొంగలు ఓ సెల్ ఫోన్ షాపులో మాత్రం కొన్ని సెల్ ఫోన్స్ లతో పాటు 20 వేలు నగదు చోరీ చేసినట్లు సమాచారం. దొంగలు రెండు మోటర్ బైకుల్లో వచ్చారు. అందరు ముసుగులు ధరించి ఉన్నట్టు సమాచారం ..

# రాజకీయాల్లో రాటుదేలిన పవన్



కాకినాడ, మార్చి 15, చంద్రబాబు వ్యూహాలు అవుడేటెడ్. ఆయన పాత కాలం నాటి స్ట్రాటజీలు ఇప్పుడు పనిచేసేటట్లు లేవు. పొత్తులు పెట్టుకుని అధికారంలోకి వస్తున్న చంద్రబాబు ఈసారి కూడా జనసేనతో కలసి ఎన్నికలకు వెళ్లి మరోసారి అధికారం పొందాలని భావిస్తున్నారు. అందుకు ఎన్నికలకు ముందు పవన్ వద్దకు వెళ్లి మరీ ఆయనను పరామర్శించి వచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీలనివ్వకూడదంటూ జనసేనను దగ్గరకు చేర్చుకునే ప్రయత్నం చేశారు. అయితే ఈసారి చంద్రబాబు ఎత్తుగడలు అంత సులువుగా వర్క్ అవుట్ అయ్యే అవకాశం కనిపించడం లేదు. ఇంతకు ముందులా మీడియా సర్వేలు, ప్రధాన పత్రికల మద్దతు ఇవేమీ నేతలకు పట్టడం లేదు. తాము అనుకున్న గోల్ కు చేరాలనుకుంటున్నారు. పవన్ కూడా అంతే. పవన్ కల్యాణ్ కూడా పార్టీ పెట్టి పదేళ్లవుతుంది. ఆయన కూడా రాజకీయంగా రాటుదేలినట్లుంది. ముఖ్యమంత్రి పదవి ఇస్తేనే చంద్రబాబుతో వచ్చే ఎన్నికల్లో పొత్తు ఉంటుందన్న సంకేతాలను బలంగా పరోక్షంగా ఇచ్చారు. అంతే కాదు జనసేన కోరుకున్న స్థానాలను పొత్తులో భాగంగానే పొందితేనే టీడీపీతో జత కడతారు. లేకుంటే లేదు. పొత్తు లేకపోయినా పవన్ కల్యాణ్ కు పెద్దగా వచ్చే నష్టమేమీ లేదు. అది ఆయనకూ తెలుసు. 25 ఏళ్ల పాటు తాను రాజకీయం చేస్తానని ఆయన చెప్పుకుని మరీ పార్టీని పెట్టారు. గత రెండు ఎన్నికల పరిస్థితి వేరు. 2024 ఎన్నికల పరిస్థితి వేరు. చంద్రబాబుకు పవన్ ను డీల్ చేయడం అంత సులువు కాదనిపిస్తుంది. దీనికి తాజాగా పవన్ కల్యాణ్ వ్యాఖ్యలే నిదర్శనమని చెప్పుకోవాలి. తెలుగుదేశం పార్టీ ఎత్తుగడలు తనకు తెలియనవి కావని పవన్ తె?తెలిపారు. తనతో మంచిగా ఉంటూనే కేవలం ఇరవై సీట్లకు మాత్రమే పరిమితం చేయాలన్న సంకేతాలను ఆ పార్టీ ఇస్తుందని కూడా తెలుసునని అన్నారు. జనసేన స్వతంత్రంగా ఉ ఒటుందే తప్ప ఒకరి వద్ద ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టబోనని ఆయన కాపు సంక్షేమ సేన ప్రతినిధులతో జరిగిన సమావేశంలో చేసిన వ్యాఖ్యలు రాజకీయాల్లో మరోసారి హీట్ ను రేపాయి. తనపై వెయ్యి కోట్లు ప్యాకేజీ అంటూ ప్రచారం మొదలుపెట్టారన్నారు. అయితే జనసేన పెట్టి పదేళ్లవుతున్నా ఇంకా అనుకూల పవనాలు రాలేదన్నారు. తాను వేరే పార్టీ అజెండాను మోయలేమన్నారు. పదివేల కోట్లున్నా సంకల్పం లేకుంటే పార్టీని నడపలేమన్నారు. లోపాయికారి ఒప్పందాలకు లొంగిపోను అంటూ పవన్ కల్యాణ్ కాపు సంక్షేమ సేన కార్యకర్తలకు క్లారిటీ ఇచ్చారు. మరో వైపు కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు హరిరామ జోగయ్య కూడా తెలుగుదేశం పార్టీపై నిప్పులు చెరిగారు. జగన్ పోవాలి.. పవన్ రావాలి అన్నదే కాపు సంక్షేమ సేన లక్ష్మమన్న హరిరామ జోగయ్య జనసేనను బలహీన పర్చాలని చంద్రబాబు చూస్తున్నారన్నారు. కన్నా లక్ష్మీనారాయణ, మహాసేన రాజేష్ లను జనసేనలో చేరకుండా చంద్రబాబు అడ్డుకున్నారని జోగయ్య ఆరోపించారు. కేవలం ఇరవై సీట్లకే జనసేనను పరిమితం చేసి తాను తిరిగి ముఖ్యమంత్రి కావాలని చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని జోగయ్య అన్నారు. దీనికి పవన్ కల్యాణ్ కూడా తాను ఎవరి లోపాయికారీ ఒప్పందాలకు లొంగనని చెప్పడంతో టీడీపీ, జనసేన పొత్తు అంత సులువుగా అయితే కుదిరేటట్లు లేవు. ముఖ్యమంత్రి పదవిని కనీసం రెండున్నరేళ్లయినా పవన్ కల్యాణ కు ఇస్తేనే పొత్తు కుదురుతుందని, అందుకు జనసేన కూడా సిద్ధమవుతుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## విశాఖలో క్రికెట్ సందడి

విశాఖపట్నం విశాఖ మరో అంతర్జాతీయ మ్యాచ్ కు వేదిక కాబోతోంది.క్రికెట్ ఫ్యాన్స్ ఆతృతగా ఎదురు చూస్తున్న తరుణం ఆసన్నమయ్యే సమయం సమీపిస్తున్న కొద్ది తమ అభిమాని క్రికేటర్ ను ఎప్పుడు చూద్దామా అని ఆశతో ఎదురు చూస్తున్నారు.విశాఖ గడ్డపై భారత్ విజయం సాధించాలని గంపెడాశతో ఉన్న అభిమానులు మ్యాచ్ టిక్కెట్లను దక్కించుకొని తెగ సంబర పడుతున్నారు.నువ్వా నేనా అంటూ హోరాహోరీగా సాగే మ్యాచ్ కోసం మరోవైపు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.భారీగా క్రికేట్ లవర్స్ తరలిరావడంతో స్టేడియం వద్ద సందడి వాతావరణం నెలకొంది.సుదీర్ఘ విరామం తర్వాత జరగనున్న వన్డే మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు క్రీడాభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.విశాఖ వేదికగా ఈ నెల 19వ తేదీన భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య వన్డే మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్ కోసం ఇప్పటి నుంచే టిక్కెట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఇవి ఆన్‌లైన్‌లో ఈ నెల 10 నుంచే అందుబాటులో ఉంచగా.. ఆఫ్‌లైన్‌లో నేటి నుంచి విక్రయిస్తున్నారు.విశాఖ నగరంలోని పీఎంపాలెం క్రికెట్ స్టేడియం-బి మైదానం, జీవీఎంసీ మున్సిపల్ స్టేడియం, రాజీవ్‌గాంధీ క్రీడా ప్రాంగణం వద్ద టికెట్ల విక్రయాలు జరుగుతున్నాయి. టికెట్ కౌంటర్ల వద్ద వేకువజాము నుంచే క్రికెట్ అభిమానులు బారులు తీరారు.టికెట్ల కోసం పలువురు మహిళలలు కూడా పోటీ పడ్డారు.

## విశాఖలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

విశాఖపట్నం ఇంటర్మీడియట్ పరీక్షలు విశాఖలో ప్రారంభమయ్యాయి. విద్యార్థులంతా గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరు కున్నారుఉమ్మడి విశాఖ జిల్లాలో 1, 13, 251 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో 56, 504 మంది ప్రథమ, 56, 747 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. వీరికోసం 128 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విశాఖ జిల్లాలో 75, 242 మంది విద్యార్థులు ఉండగా 78 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారి తెలిపారు.

## విశాఖలో అట్టహాసంగా ప్రారంభమైన యూత్ కాంగ్రెస్ ట్రైనింగ్ క్లాసులు

రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ క్లాసులు విశాఖ వేదికగా ప్రారంభమైయ్యాయి.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఏఐసీసీ సెక్రటరీలు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారా వు ఈ ట్రైనింగ్ క్లాసులు ప్రారంభిం చా రు.దేశంలో నెలకొన్న తాజా పరిస్థితి, కాంగ్రెస్ ప్రభు త్వ హయాంలో జరిగిన అభివృద్ధి,ప్రస్తుత ప్రభుత్వ అనుసరిస్తు న్న ప్రతికూల పరిస్థితిని ఈ సందర్భం గా యువతరానికి వివరించారు.దేశ రాజకీయాల్లో యువ త ప్రముఖ పాత్ర పోషించేందుకు ఈ ట్రైనింగ్ క్లాసులు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమం పీసీసీ తో పాటు పీసీసీ అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాస్, ఇతర జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## జి 20 సమావేశాల అన్ని ఏర్పాట్లు పూర్తి

**-కలెక్టర్ మల్లికార్జున**

విశాఖపట్నం విశాఖ వేదికకగా ఈనెల 28 నుంచి 30 వరకు విశాఖ వేదికగా జరిగే జి 20 సమావేశాల అన్ని ఏర్పా ట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు.ఈ సమావేశాల్లో 40 దేశాల కు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్నా రని, సమా వేశాలకు వస్తున్న విదేశీ ప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని వివరించా రు.విదేశాలు నుంచి వస్తు న్న ప్రతినిధులకు తెలుగు సంప్రదాయా లు ప్రకారం స్వాగతం పలికేలా కార్య క్రమాలు ఏర్పాటు చేశామని,విదేశీ ప్రతినిధుల సమావేశంలో సీఎం జగ న్మోహన్ రెడ్డి పాల్గొంటారని తెలిపా రు.జి 20 సమావేశాలు నేపద్యంలో 100 కోట్ల తో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు.సీపీ శ్రీకాంత్ మాట్లాడుతూ జి 20 సమావేశాలకు 2 వేలు మంది పోలీసులు తో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, విదేశీ ప్రతినిధులు ఉన్న చోట ప్రత్యేక భద్రత చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.జి 20 సమావేశాలు నేపథ్యం లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ లు ఏర్పా టు చేస్తున్నామని,విశాఖ వసూలు సమావేశాలు జరిగే సమయం లో పోలీసులకు సహకరించాలని కోరారు

# పోలీసుల మీద ఒత్తిడి పెట్టకుండా వాళ్ల పని వాళ్లని చేయనీయాలి

**హత్య కేసులో ఎవరైనా సరే.. ఎంతటి వారైనా సరే బయటకు రావాలి**

**వైఎస్ వివేకా కుమార్తె వైఎస్ సునీతారెడ్డి**



కడప మార్చ్ 15 వైఎస్ వివేకా నాలుగో వర్ధంతి సందర్భంగా తండ్రి సమాధి వద్ద ఆయన కుమార్తె వైఎస్ సునీతారెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి హత్య కేసులో సొంత కుటుంబసభ్యుల మీద ఆరోపణలు చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేసు విచారణ దశలో ఉందని.. ఈ సమయంలో తాను దీనిపై మాట్లాడబోనన్నారు. తనకు తెలిసిన విషయాలన్నీ.. సీబీఐకి ఇచ్చానన్నారు. ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలను ప్రభావితం చేయకూడదని పేర్కొన్నారు. పోలీసుల మీద ఒత్తిడి పెట్టకుండా వాళ్ల పని వాళ్లని చేయనీయాలని సునీత పేర్కొన్నారు.వైఎస్ వివేకా హత్య కేసులో ఎవరైనా సరే.. ఎంతటి వారైనా సరే బయటకు రావాలని సునీత పేర్కొన్నారు. పిల్లలు తప్పు చేస్తే ఖండిస్తామని.. అలాగే పెద్దలు తప్పు చేసినా వదిలిపెట్టకూడదన్నారు. కడప అరాచకాలు తగ్గాయి అనుకున్నానని.. కానీ తగ్గలేదన్నారు. ఎక్కడికెళ్లినా కడపలో అరాచకాల గురించి మాట్లాడుతున్నారన్నారు. కడపకు అనేక విద్యాసంస్థలు వచ్చాయి కాబట్టి అరాచకాలు తగ్గాయనుకున్నానన్నారు. కానీ తన తండ్రి హత్య తర్వాత అరాచకాలు తగ్గలేదని రుజువైందన్నారు. తప్పు చేసిన వాళ్లకి శిక్షపడితేనే నేరాలు తగ్గుతాయని వైఎస్ సునీత పేర్కొన్నారు.ముఖ్యమంత్రి జగన్ బాబాయ్, మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురై నాలుగేళ్లు. ఆయనను 2019 మార్చి 15న కడప జిల్లా పులివెందులలోని స్వగృహంలోనే దారుణంగా హత్యచేశారు. గొడ్డలివేటుతో పాశవికంగా మట్టుబెట్టారు. కత్తులు దూసే కడప రాజకీయంలో అజాతశత్రువుగా వివేకాకు పేరు. ఎన్ని పదవులు అలంకించినా వాటిని తలకు ఎక్కించుకోని సౌమ్యునిగా, అందరివాడుగా మెలిగారు. అలాంటి నేత కిరాతక హత్యకు గురికావడం అప్పట్లో పెను సంచలనం రేపింది. ఆయన మరణం విషయం తెలుస్తూనే.. తొలుత రక్తవాంతులు చేసుకుని గుండెపోటుతో మృతిచెందారు అంటూ జగన్ సొంత మీడియా ప్రకటించింది. వివేకా మరణంపై ఆయన కూతురు సునీత అనుమానం వ్యక్తం చేయడంతో అది చివరికి హత్యగా తేల్చారు.

## తిరుపతిలో ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తిరుపతి తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి . ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది . గూడూరు పట్టణ పరిధిలో ాఐఖీ ప్రభుత్వ జూనియర్ కళాశాల , స్వర్ణాంధ్ర భారతి కళాశాల , సెయింట్ మేరీస్ కళాశాల , డి ఆర్ డబ్ల్యు కళాశాల , నారాయణ కళాశాల మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు . గూడూరు పట్టణం మరియు మండల పరిధిలోని 1468 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు .

## ముస్లీం ల సమస్యలను తీరుస్తాం

తంబళ్లపల్లి అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లి నియోజకవర్గం, బుచ్చిరెడ్డిపల్లి క్రాస్ వద్ద యువనేత నారా లోకేష్తో ముస్లింలు సమావేశం అయ్యారు. అయనకు పలువురు తమ సమస్యలను చెప్పుకున్నారు.ఉర్దూ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలి. ముస్లింల రిజర్వేషన్ ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు..మీరు పోరాడాలి. దుల్హన్ స్కీంకు కఠిన నిబంధనలు పెట్టారు. అర్హులకి అందేలా చూడాలి. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ముస్లిం మహిళలకు ఉపాధి కల్పించాలి. ముస్లిం పిల్లలు పెద్దచదవులు చదవాలంటే హైదరాబాద్, విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. స్థానికంగా ముస్లింలకు విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలి. వైసిపి పాలనలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఒక్క రూపాయి రుణం ఇవ్వలేదు. మసీదు, ఈద్గా ల అభివృద్ధి కి నిధులు ఇవ్వడం లేదు. ఖబర్ స్తాన్ ల వద్ద కనీసం మౌలిక వసతులు కల్పించడం లేదని అన్నారు. సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ మైనార్టీల్లో పేదరికం లేకుండా చెయ్యడమే టిడిపి లక్ష్యం. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తాం. వక్ఫ్ ఆస్తులు కాపాడటానికి జ్యుడిషియల్ పవర్ కల్పిస్తాం. తంబళ్లపల్లె లో తాలిబాన్ పాలన నడుస్తుంది. ముస్లింల అభివృద్ధికి కృషి చేసింది ఒక్క టీడీపీనే. దేశంలోనే మొదటి మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది టిడిపి.

## అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం

డోన్ డోన్ పాతపేట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు బుధవారం ఉదయం ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం నందు సీనియర్ ఉపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ వినియోగదారులందరూ దుకాణం నందు వస్తువును కొనుగోలు చేసినప్పుడు, ఆ వస్తువు తయారుచేసిన తేదీ మరియు ఎక్స్పైర్ తేదీని గమనించి కొనాలని, కొన్ని ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలన్నారు.ముఖ్యంగా మెడిసిన్ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. మినరల్ వాటర్ కొనేటప్పుడు ఐఎస్ఐ మార్కు ఉన్న వాటర్ బాటిల్ తీసుకోవాలన్నారు, బంగారు మరియు వెండి వస్తువులు కొనేటప్పుడు హాల్ మార్క్ గమనించాలన్నారు,అలాగే విత్తనాలు, ఎరువులు,మందులు కొన్నప్పుడు కూడా జాగ్రత్త వహించాలని సూచించారు,ఏ వస్తువును కొనుగోలు చేసిన ఖచ్చితంగా బిల్లు తీసుకుని, ఏదైనా సమస్య వేస్తే వినియోగదారుల ఫోరం కు కంప్లైంట్ ఇస్తే, వారు ఎంక్వయిరీ చేయగలరన్నారు,ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకటేశ్వర్ గౌడ్, రవిశేఖర్, వెంకట లక్ష్మి, వెంకట రమణ, లక్ష్మయ్య, చంద్రశేఖర్ గౌడ్, సుబ్బారెడ్డి, రాధ, అనంత శ్రీనివాసులు,అల్లిపీరా, లక్ష్మి కాంతరెడ్డి, సుభాన్, మధుసూదన్ రెడ్డి, మద్దిలేటి, భూకాంతరెడ్డి, జయసుబ్బారాయుడు, శివన్న, ఆదినారాయణ, సురేష్, లీలావతమ్మ, శ్రీకళ, భారతి, రమేష్, సంజీవరెడ్డి, దేవేంద్రప్ప, రాఘవేంద్ర, రామ్మూర్తి, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, భాను ప్రకాష్ రెడ్డి, లక్ష్మి ప్రభావతి, మునిరాజు, ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు

# నంద్యాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ , ఎస్పీ





నంద్యాలమార్చి 15 -:నంద్యాల జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం నంద్యాల పట్టణంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజి,నూక్లియస్ జూనియర్ కాలేజి,నేషనల్ జూనియర్ కాలేజి,రావూస్ జూనియర్ కాలేజి,నారాయణ జూనియర్ కాలేజి మొదలగు ఇంటర్ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ , ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపెరింటెండెంట్లుకు పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రంలో మొబైల్ ఫోన్ లను అనుమతించరాదని, పరీక్షా కేంద్రాల దగ్గరలో జిరాక్స్ సెంటర్లు, ప్రింటింగ్ సెంటర్లు మూయించాలని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో బయట వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు తిరగకుండా చూడాలని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి విమర్శలకు తావులేకుండా సమర్ధవంతంగా నిర్వహించడానికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన కనీస వసతులు సమకూర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 51 ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ నిక్కచ్చిగా అమలు చేస్తున్నామని, పరీక్షా సమయంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామని, పరీక్షలు జరుగు సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం తిరుగుతూ ఉంటాయని, ప్రశ్నా పత్రాల తరలింపు, సమాధాన పత్రాలు డిపాజిట్ చెయ్యడానికి తగిన ఎస్కార్ట్ ను ఏర్పాటు చేయడం జరిగిందిని, పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా జరగడానికి పోలీస్ శాఖ తరఫునుండి అన్ని చర్యలు తీసుకున్నామని తెలియ చేసారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో అనుమానిత వ్యక్తులు ఉన్నట్లు తెలిస్తే వెంటనే అదుపులోకి తీసుకుంటామని, విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినా, చిట్టీలు, పుస్తకాలు పెట్టి మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ కు విద్యార్థులు పాల్పడినా వారికి ఎవరైనా సహకరించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

ఈ కార్యాక్రమంలో జిల్లా కలెక్టర్ , ఎస్పీ తో పాటు నంద్యాల టౌన్ డిఎస్పీ మహేశ్వర్ రెడ్డి , ఎఎ టౌన్ సిఐ ప్రభాకర్ రెడ్డి , ఎస్ ఐ హరినాథ్ రెడ్డి , ఆర్ ఎస్ ఐ వీరన్న పాల్గొన్నారు.

# పాడి పశువులు అభివృద్ధి చెందాలంటే ఎదసూదితప్పనిసరి



ఎమ్మిగనూరు --ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామం పాడి పశువులు అభివృద్ధి చెందాలంటే ఎదసూదితప్పనిసరిపాడిపశువులలో పెయ్య దూడల అభివృద్ధి ఉన్నప్పుడేపాడిపశువుల అభివృద్ధి జరిగి,రైతులు అభివృద్ధి చెందుతారు, డాక్టర్ అశోక్ పేర్కొన్నారు. కందనాతి గ్రామంలో పశువుల ఆసుపత్రి ఆవరణలో బుధవారం గాలి కుంట టీకాలు వేయించుకోవాలని డాక్టర్ అశోక్ రైతులకు తెలిపారు కార్యక్రమంలో ఎప్పుడైతే వాటి లక్షణాలు ఉంటాయో డాక్టర్ అశోక్ ను. సంప్రదించాలని వారు కోరారు ,లేగదూడల అనంతరం పశువులకు ఎదసూది వేయించిన రైతులకు పశుగాణాభివృద్ధి జరగాలంటే వేలు జాతి పెయ్య దూడల సంతతి.పెరగాలని .అందుకొరకులింగనిర్ధారణ ఎదసూదులుప్రతిరైతువేయించాలని తెలిపారు.రైతులకు ఎద సూదులు ప్రభుత్వం 500 రూపాయలకు రెండు సూదులు సబ్సీడీతో వేస్తున్నార ని,మిగిలిన 825 రూపాయలు ప్రభుత్వం భరిస్తుందనితెలిపారు. కనుక ప్రతి రైతు ఈ సువర్ణ అవకాశాన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర చాకలి నల్లన్న మరియు పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశైలంలో ఉగాది ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించిన కార్యనిర్వాహణాధికారి...!

శ్రీశైలం : ఈనెల 19 నుండి 23 వరకు ఐదు రోజులపాటు ఉగాది మహోత్సవాలు నిర్వహించబడుతున్న నేపథ్యంలో ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాదయాత్రతో క్షేత్రాన్ని చేరుకుంటున్నారు అందుకే కాలిబాటలో అటవీశాఖ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సమన్వయంతో పలు చేపడుతున్నాయి. ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా బుధవారం రోజున శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మరియు సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులు తో కలిసి కైలాస ద్వారం మరియు భీముని కొలను మెట్ల మార్గం వద్ద ఏర్పాట్లు పరిశీలించారు శ్రీశైలం కు పాదయాత్రని వచ్చే భక్తులు వెంకటాపురం, పెచెరువు ,భీమునికొలను, మెట్ల మార్గం ద్వారా కైలాస ద్వారం చేరుకుంటారు అక్కడి నుండి హటీకేశ్వరం మీదిగా శ్రీశైలం చేరుకుంటారు. ఇందులో భాగంగా కైలాస ద్వారం వద్ద భక్తుల సౌకర్యార్థం పలు ఏర్పాట్లు చేయడం జరిగింది. కైలాస ద్వారం వద్ద భక్తులు సేద తీరేందుకు వీలుగా విశాలమైన తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే కైలాస ద్వారానికి నిరంతరం మంచినీటి సరఫరా చేయడం జరిగింది. ముఖ్యంగా కైలాస్ దూరం నుండి భీమునికొలను వరకు తాత్కాలిక పైపులు ద్వారా మంచినీటి నీ అందజేయడం జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లు పరివేక్షణ లో భాగంగా బుధవారం రోజున దేవస్థానం అధికారులు పర్యవేక్షించారు. అంతేకాకుండా కైలాస ద్వారం వద్ద కన్నడిగులు ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని పరిశీలించారు. దాతలు మరియు సేవా సంఘాల వారు నిర్వహిస్తున్న అన్నదాన నిర్వహణ, మరియు చలవపంది ల్ల ఏర్పాటు నూ మరియు మంచినీటి సరఫరా, మజ్జిగ సరఫరా మొదలైన ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. కార్యనిర్వహణాధికారి వారు మాట్లాడుతూ తప్పనిసరిగా సూచి శుభ్రత పాటించాలన్నారు ఇంకా వారు మాట్లాడుతూ కైలాస ద్వారం వద్ద తగినంత పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలని దేవస్థానం పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు.క్యూలైన్లను పరిశీలించిన కార్యనిర్వాహణాధికారిఈనెల 19 నుండి 23 వరకు నిర్వహించబోతున్న ఉగాది ఉత్సవాల సందర్భంగా కర్ణాటక మహారాష్ట్ర రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైల దేవస్థానాన్ని సందర్శించే అవకాశం ఉంది కావున శ్రీశైలం దేవస్థానం ఈఓ లవన్న క్యూలైన్లు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిరంతరం మంచినీటి సరఫరా క్యూలైన్లలో శీఘ్రదర్శనం అతి శీఘ్ర దర్శనం లైన్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారికి నిరంతరం అల్పాహారం మంచినీటి సరఫరా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా క్యూలైన్లో వేచి ఉండే భక్తులకు ఫ్యాన్లు కరెంటు సౌకర్యం ఉండే విధంగా సంబంధిత ఎలక్ట్రికల్ విభాగం వారిని ఆదేశించారు.

# ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి : జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు





కర్నూలు, మార్చి, 15 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని గాయత్రీ ఎస్టేట్ లోని నారాయణ జూనియర్ కళాశాల, భాగ్యనగర్ లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల మరియు రైల్వే స్టేషన్ రోడ్డులోని నారాయణ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు. ఇన్విజిలేటర్లు, విధులు నిర్వహించే సిబ్బంది కూడా పరీక్షా కేంద్రాల లోకి ఫోన్ లు తీసుకెళ్లకుండా చూడాలని సంబంధిత ఆఫీస్ రూమ్ లోనే భద్రపరచాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసేలా పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్మీడియేట్ పరీక్షల నిర్వహణలో అవాంఛనీయ సంఘటన జరగకూడదని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.మాల్ ప్రాక్టీస్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, తప్పులు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# అలా ఉండడానికి ఇష్టపడతాను.. : తమన్నా



మిల్కీ బ్యూటీ తమన్నా తనకు నచ్చిన వస్త్రధారణ గురించి చెప్పింది. ఎప్పుడూ క్యాజువల్‌గా ఉండడానికి ఇష్టపడతానని తెలిపింది.తాజాగా లాక్మే ఫ్యాషన్ వీక్‌లో పాల్గొన్న ఈ నటి వయ్యారంగా ర్యాంప్ వాక్ చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో తమన్నా మాట్లాడుతూ.. తనకు సౌకర్యవంతంగా ఉండే దుస్తులను మాత్రమే ధరిస్తానని తెలిపింది. "నా జుట్టు అంటే నాకు చాలా ఇష్టం.దానికోసంఎక్కువ కాస్మోటిక్స్ ఉపయోగిం చను. ఎప్పుడూ సహజంగా ఉండేలా చూస్తాను. అందుకే ఉల్లిపాయ రసాన్ని వాడతాను" అని తన బ్యూటీ సీక్రెట్ చెప్పింది. ఇక గత కొన్ని రోజులుగా ఈ అమ్మడు తరచూ వార్తల్లో ఉంటోన్న విషయం తెలిసిందే. నటుడు విజయ్ వర్మతో రిలేషన్‌లో ఉందనే వార్త కొన్ని రోజులుగా వైరలవుతుంది. దీనిపై తాజాగా ఈ భామ మీడియాకు కాస్త ఘాటుగానే సమాధానం చెప్పింది. "మేమిద్దరం కలిసి ఓ సినిమాలో నటించాం. అప్పటి నుంచి మాపై రూమర్స్ ప్రచారం చేస్తున్నారు. దీనిపై అందరికీ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం లేదు" అని వెల్లడించిందిఇక తన అందంతో ప్రేక్షకులను ఆకట్టుకునే తమన్నా ప్రస్తుతం అగ్ర హీరోల సరసన నటిస్తోంది. చిరంజీవితో కలిసి 'భోళా శంకర్' (లో ఆడిపాడనుంది. తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌తో కలిసి 'జైలర్' లో సందడి చేయనుంది. వీటితోపాటు 'అరణ్మయై4', 'బోలేచుడియన్' ,'భంద్రా' చిత్రాల్లో నటిస్తోంది.

# ఖరీదైన 6 బెడ్ రూమ్‌ల భవనాన్ని కొనుగోలు చేసిన పాంటింగ్.. ధర ఎంతో తెలుసా..?



ఆస్ట్రేలియా మాజీ సారధి, టూ టైమ్ వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్, ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ శివారు ప్రాంతమైన టూరక్‌లో అత్యంత విలాసవంతమైన 6 బెడ్ రూమ్‌ల భవనాన్ని కొనుగోలు చేశాడు.లగ్జరీ స్విమ్మింగ్ పూల్‌తో పాటు టెన్నిస్ కోర్ట్ కలిగిన ఈ మాన్షన్ ఖరీదు 20 మిలియన్ డాలర్లకు పైనే ఉంటుందని ఆస్ట్రేలియా మీడియా కథనాలు ప్రసారం చేస్తుంది.1400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పాలరాతిచే నిర్మించబడ్డ ఈ అత్యధునిక విల్లాలో ఇండోర్-అవుట్‌డోర్ లివింగ్ స్పేస్‌లతో పాటు ఆధునిక వంటగది సమకూర్చబడింది. పాంటింగ్ ఇంత విలాసవంతమైన భవనాన్ని కొనుగోలు చేయడం ఇది మొదటిసారి కాదు. 2013లో ఈ ఆసీస్ మాజీ కెప్టెన్ 9.2 మిలియన్ డాలర్లు వెచ్చించి బ్రైటన్‌లోని బీచ్‌సైడ్ శివారులో ఓ లగ్జరీ మ్యాన్షన్‌ను కొన్నాడు.పస్తుతం పాంటింగ్ కుటుంబంతో కలిసి అందులోనే నివాసం ఉంటున్నాడు. బ్రైటన్ గోల్డెన్ మైల్‌గా పిలవబడే ఆ సుందర భవనంలో 7 పడక గదులు, ఎనిమిది స్నానపు గదులు, అంతర్గత థియేటర్ మరియు బీచ్‌కి ప్రైవేట్ లేన్‌వే ఉన్నాయి.ఈ రెండు భవనాలే కాక పాంటింగ్ 2019లో మరో భవనాన్ని కూడా కొనుగోలు చేశాడు. దాని ఖరీదు 3.5 మిలియన్ డాలర్లు. ఇందులో నాలుగు పడక గదులు, మూడు బాత్‌రూమ్‌లు ఉన్నాయి. ఈ విల్లా పోర్ట్ వ్యూ కలిగి ఉంటుంది.ఇదిలా ఉంటే, అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్న పాంటింగ్.. ఆస్ట్రేలియా తరఫున 168 టెస్ట్ మ్యాచ్‌ల్లో 51.85 సగటున 41 సెంచరీల సాయంతో 13,378 పరుగులు చేశాడు. 374 వన్డేల్లో 41.81 సగటున 29 సెంచరీల సాయంతో 13,589 పరుగులు చేశాడు.

# దసరాతో నాని టార్గెట్ ఎంతంటే?



నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఒదేల దర్శకత్వంలో తెరకెక్కిన దసరా మూవీ మార్చి 30న రిలీజ్ కాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ఐదు ఇండియన్ భాషలలో రిలీజ్ అవుతుంది. హిందీతో పాటు సౌత్ భాషలలో ఈ మూవీని ప్రేక్షకుల ముందుకి తీసుకొని వస్తున్నారు. తెలుగులో స్ట్రైట్ మూవీగా వస్తున్న మిగిలిన భాషలలో మాత్రం డబ్బింగ్ సినిమాలానే వెళుంది. అయితే యూనివర్సల్ కాన్సెప్ట్ కావడంతో దేశ వ్యాప్తంగా అందరికి రీచ్ అవుతుందని భావిస్తున్నారు.ఇదిలా ఉంటే ఈ మూవీ ద్వారా తాను కూడా బిగ్ స్టార్స్ జాబితాలోకి వెళ్ళాలని నాని టార్గెట్ గా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. ఈ మూవీ బడ్జెట్ 60 కోట్ల వరకు ఉంటుంది. అయితే టీజర్ సాంగ్స్ ద్వారా ఇప్పటికే మూవీ బిజినెస్ గ్రాండ్ గానే జరిగింది. తెలుగులోనే ఈ మూవీ ఏకంగా వంద కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. మిగిలిన భాషలలో కూడా కాస్త స్ట్రాంగ్ గా అయ్యిందనే మాట వినిపిస్తుందో. కారణం తెలుగు నుంచి వస్తున్న పాన్ ఇండియా మూవీ అనే బ్రాండ్ అని చెప్పాలి. టాలీవుడ్ నుంచి ఇప్పటి వరకు వచ్చిన అన్ని పాన్ ఇండియా సినిమాలు సక్సెస్ ని అందుకున్నాయి. ఈ కారణంగానే నాని సినిమాకి డీసెంట్ బిజినెస్ మిగిలిన భాషలలో జరిగిందని అంచనా. ఇదిలా ఉంటే ఈ మూవీతో కచ్చితంగా నాని వంద కోట్ల షేర్ అందుకుంటాడు అని ట్రెండ్ పండితులు అంచనా వేస్తున్నారు. అయితే నాని మాత్రం ఈ మూవీతో ఏకంగా 150 కోట్ల షేర్ ని రాబట్టాలని టార్గెట్ గా పెట్టుకున్నట్లు సమాచారం.దీనికోసమే అన్ని భాషలలో ప్రమోషన్ బాధ్యతలని తన భుజాల మీద వేసుకున్నారని టాక్. అయితే నాని అనుకుంటున్న 150 కోట్ల షేర్ టార్గెట్ అంటే అంత ఈజీ కాదు. కాని అందుకుంటే మాత్రం నెక్స్ట్ నాని సినిమాలకి మార్కెట్ పరంగా మరింత్ రీచ్ ఉంటుందని అంచనా వేస్తున్నారు. కీర్తి సురేష్ కి తెలుగుతో పాటు తమిళ్ మలయాళీ భాషలలో మంచి మార్కెట్ ఉంది. అలాగే మ్యూజిక్ దర్శకుడు సంతోష్ నారాయణన్ కి తమిళంలో మంచి హైప్ ఉంది. వీరి ద్వారా ఆయా భాషలలో సినిమాకి మంచి కలెక్షన్స్ వస్తాయని ఆశిస్తున్నారు.

# పాకిస్తాన్ క్రికెట్‌లో సమూల మార్పులు.. తొలుత కెప్టెన్, తాజాగా కోచ్‌లు

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తమ జాతీయ జట్టులో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. రమీజ్ రాజా నుంచి పీసీబీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక, తొలిసారి జట్టు మొత్తం ప్రక్షాళణ చేపట్టిన నజమ్ సేథీ..త్వరలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగనున్న టీ20 సిరీస్‌కు కెప్టెన్‌గా షాదాబ్ ఖాన్‌ను, హెడ్ కోచ్‌గా అబ్దుల్ రెహ్మాన్‌ను, బ్యాటింగ్ కోచ్‌గా మహ్మద్ యూసఫ్‌ను, బౌలింగ్ కోచ్‌గా ఉమర్ గుల్‌ను నియమించింది.సెలెక్షన్ కమిటీ నూతన చీఫ్ హరూన్ రషీద్ అమల్లోకి తెచ్చిన కొత్త వర్క్ లోడ్ పాలసీని బూచిగా చూపుతూ తొలుత కెప్టెన్ బాబర్ ఆజమ్‌ను పక్కకు పెట్టిన పీసీబీ.. తాజాగా హెడ్ కోచ్, కోచింగ్ సిబ్బంది, నాన్ కోచింగ్ సిబ్బందిపై వేటు వేసి వారి స్థానాల్లో కొత్త వారిని నియమించింది. ఈ మార్పులన్నీ తాత్కాలికమేనని పీసీబీ చెబుతున్నప్పటికీ.. ఈ స్థాయిలో ప్రక్షాళణ జరగడం పలు అనుమానాలకు తావిస్తుంది.గత కొంతకా లంగా బాబర్ ఆజమ్‌పై గుర్రుగా ఉన్న పీసీబీ పలు మార్లు అతన్ని తప్పించి సారధ్య బాధ్యతలు ఇతరుల కు కట్టబెట్టాలని ప్రయత్నాలు చేసింది. అయితే బాబర్‌కు ఉన్న బలమైన కోతరి కారణంగా అది సాధ్యపడలేదు. తాజాగా పీసీబీ చీఫ్ ఏదైతే అద్దైందని తెగించి ప్రక్షాళణకు శ్రీకారం? చుట్టినట్లు సమాచారం. కాగా, షార్జా వేదికగా మార్చి 24, 26, 27 తేదీల్లో పాకిస్తాన్- ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరుగనున్న విషయం తెలిసిందే. ఈ సిరీస్‌కు మాత్రమే తాజాగా జరిగిన మార్పు లన్నీ (కెప్టెన్, కోచింగ్,



నాన్ కోచింగ్ స్టాఫ్) వర్తిసాయని పీసీబీ ప్రకటిన విడుదల చేసినప్పటికీ, ఎక్కడో ఏదో జరుగుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.బాబర్ ఆజమ్‌తో పాటు సీనియర్లు మహ్మద్ రిజ్వాన్, షాహీన్ అఫ్రిది, ఫకర్ జమాన్, హరీస్ రౌఫ్‌లకు విశ్రాంతి నిచ్చిన పీసీబీ.. సైమ్ అయూబ్, ఇహసానుల్లా లాంటి పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) స్టార్లకు జట్టులో తొలిసారి అవకాశం కల్పించింది.ఆఫ్ఘనిస్తాన్‌తో టీ20 సిరీస్‌కు పాకిస్తాన్ జట్టు..షాదాబ్ ఖాన్ (కెప్టెన్), అబ్దుల్లా షఫీక్, ఆజమ్ ఖాన్ (వికెట్‌కీపర్), ఫహీమ్ అష్రాఫ్, ఇఫ్తికార్ అహ్మద్, ఇహసానుల్లా, ఇమాద్ వసీం, మహ్మద్ హరీస్ (వికెట్‌కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ వసీం, నసీం షా, సైమ్ అయూబ్, షాన్ మసూద్, తయాబ్ తాహిర్, జమాన్ ఖాన్

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190